Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 | సంచిక : 351 | మేడ్చల్ మల్కాజ్‌గిరి | 10 జనవరి 2024 | బుధవారం | పేజీలు : 4

## ముంచుకొస్తున్న గడువు..

### నేడు కీలక సమావేశానికి బీజేపీ నిర్ణయం..

అయోధ్యలో రామ్ లల్లా ప్రాణ ప్రతిష్ఠ కోసం సిద్ధమవుతున్న తరుణంలో బీజేపీ కీలక సమావేశం నిర్వహించనుంది. జనవరి 10న ఈ మీటింగ్ జరగనున్నట్లు వెల్లడించింది. రామమందిర ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష ఆదరణ వస్తోంది. తక్కువ సమయం మిగిలి ఉండటంతో ఏర్పాట్లు చకచకా నడుస్తున్నాయి. ఈ మేరకు భారతీయ జనతా పార్టీ.. గ్రాండ్ 'ప్రాణ్ ప్రతిష్ఠా కార్యక్రమం' ఏర్పాట్లను సమీక్షించేందుకు కీలక సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ప్రకటించింది. బీఎల్ సంతోష్, సునీల్ బన్సాల్, తరుణ్ చుగ్, వినోద్ తావ్డే వంటి పలువురు అగ్రనేతలు ఈ సమావేశంలో పాల్గొననున్నారు.

# రైతుబంధు

## రైతులకు బ్యాంక్ ఖాతాలో జమ అవుతాయా...?



## అయోమయంలో రైతన్నలు ...!!!

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ ప్రభుత్వం పరిపాలన ఉన్నప్పుడు తెలంగాణ రైతులు పండించినటువంటి పంటకు పెట్టుబడి కోసం తెలంగాణ ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత ఒక ఎకరం ఉన్న రైతుకే రైతుబంధు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అందించిందని మిగతా రైతులకు సోమవారం నుండి రైతుల బ్యాంకు ఖాతాలో వేస్తామని ప్రకటిం చినటువంటి కాంగ్రెస్ ప్రభుత్వం సోమవారం రోజు బ్యాంకు ఖాతాలో రైతుబంధు రూపాయలు జమ చేయలేదని పలు రైతులు వారి ఆవేదనలు వ్యక్తం చేశారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందే రైతు పండించినటువంటి పంట కోసం పెట్టుబడిగా రైతుల బ్యాంకు ఖాతాలో రైతుబంధు రూపాయలను వేస్తానన్న తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు రైతుబంధు వేయకుండాఅడ్డు పడినటు వంటి ప్రస్తుత తెలంగాణ రాష్ట్రాన్నిపరిపాలిస్తున్నటువంటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు

కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతన్నల ప్రభుత్వమని గత పది సంవత్సరాల నుండి పరిపాలిస్తున్నటువంటి తెలంగాణ ప్రభుత్వానికి ఓటు వేయకుండా మార్పు కోసం కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే ఆదిలోనే రైతన్నలకు చుక్కెదురుగావ రిపాలిస్తున్నటువంటి కాంగ్రెస్ ప్రభుత్వం అని పలువురు రైతులు అంటున్నారు సోమవారం నుండి రైతుబంధు రైతు బ్యాంకు ఖాతాలో వేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యకపోవడంతో రైతులు బ్యాంకు చుట్టూ పలు ఏటీఎంలో తమకు ఇస్తానన్న రైతుబంధు రూపాయలు వచ్చాయా రాలేవా అని ఉదయం నుండి సాయంత్రం వరకు వారు చేసుకున్నటువంటి పనులను వదులుకొని బ్యాంకు వద్ద నే ఎదురు చూసామని పలువురు రైతులు తెలియజేశారు వరి నాట్లు వేసే సమయం దగ్గర పడడంతో పలువురు రైతులు ఆసంల దగ్గరకు వెళ్లి అప్పులు చేసుకొని వరినాట్లనుచేసుకుంటున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే తెలంగాణలో ఉన్నటువంటి రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఆశతో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశామని దేశానికి రైతే రాజు అనే నినాదాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయినా తొలి దశలోనే రైతులకు రైతుబంధు వేయక పోవడమేకాకుండా తెలంగాణ రాష్ట్రాన్నిపరిపాలిస్తున్నటువంటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు అధికారం వచ్చినప్పుండి ఏ ఒక్క రైతుకు కూడా ఇటువంటి సరి అయిన న్యాయం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం అని పలువురు రైతులు తెలియజేస్తున్నారు ఇకనైనా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులపై కరుణ చూపి రైతుబంధు తమ ఖాతాలో జమ చేయాలని కోరుకుంటున్నామని పలువురు రైతులు తెలియజేస్తున్నారు

## ఉద్యోగాల భర్తీకి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యుల రాజీనామాలు వెంటనే ఆమోదించాలని గవర్నర్‌కి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి రిక్వెస్ట్ చేశారు. ఈ మేరకు లేఖ కూడా రాయనున్నారు. నేడు గాంధీభవన్‌లో జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. నెల రోజులు గడుస్తున్నా టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యుల రాజీనామాలు గవర్నర్ ఆమోదించలేదని తెలిపారు. నిరుద్యోగులకు ఉద్యోగాల భర్తీలో బీఆర్ఎస్ ఘోరంగా



విఫలమైందన్నారు. ఉద్యోగాల భర్తీకి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. టీఎస్‌పీఎస్సీ బోర్డు అనేక అవకతవకలకు పాల్పడిందని జీవన్ రెడ్డి పేర్కొన్నారు. బోర్డు తప్పిదాలను గత ప్రభుత్వం కప్పిపుచ్చిందన్నారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ లేకపోవడం వల్ల ఉద్యోగాల భర్తీపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోతున్నామని జీవన్ రెడ్డి తెలిపారు.

## మేడిగడ్డ బ్యారేజ్ విషయంలో రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం..

### లెక్కలు తేలుతాయా..?




జయశంకర్ భూపాలపల్లి : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో జరిగిన అవకతవకలు బయటపెతామని, మేడిగడ్డ బ్యారేజ్ కుంగుబాటుపై విచారణ చేపట్టిస్తామని గతంలో రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అన్న మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మేడిగడ్డ బ్యారేజ్ కుంగుబాటుపై సీఎం రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. మేడిగడ్డ బ్యారేజ్ కుంగుబాటుపై విజిలెన్స్ విచారణకు తెలంగాణ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో మేడిగడ్డ ప్రాజెక్ట్ కుంగుబాటుకు కారణాలు, బాధ్యులను గుర్తించే పనిలో పడ్డారు అధికారులు. ఈరోజు (మంగళవారం) కాళేశ్వరం ప్రాజెక్టు కార్యాలయాల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేపట్టారు. మహాదేవపూర్ ఇరిగేషన్ డివిజన్ కార్యాలయంలో రికార్డులను విలువైన పత్రాలను అధికారుల బృందం పరిశీలిస్తోంది. మేడిగడ్డ బ్యారేజీ, కన్నేపల్లి పంప్ హౌస్‌లకు సంబంధించిన కార్యాలయాల్లో అధికారుల బృందాలు తనిఖీలు చేపట్టారు.

పది ప్రత్యేక బృందాలతో దాడులు కొనసాగుతున్నాయి. విజిలెన్స్ అధికారుల తనిఖీలపై మంత్రి ఉత్తమ్‌కుమార్ మాట్లాడుతూ.. మేడిగడ్డపై విజిలెన్స్ విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. మేడిగడ్డ కారణాలేంటో తేల్చాలని విజిలెన్స్ అధికారులను ఆదేశించామని.. మొత్తం 12 చోట్ల తనిఖీలు జరుగుతున్నాయని ఉత్తమ్ తెలిపారు.

**అసలేం జరిగిందంటే...** కాగా.. తెలంగాణ సర్కార్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ లక్ష్మీబ్యారేజీ వంతెన కుంగిన వార్త రాష్ట్రంలో పెను దుమారాన్ని రేపింది. బ్యారేజీలోని బీ బ్లాక్ పరిధిలో గల 18,19, 20, 21 పిల్లర్ల వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. మేడిగడ్డ ప్రాజెక్ట్ కుంగడంపై అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంపై కాంగ్రెస్ సహా ప్రతిపక్ష పార్టీలు దుమ్మెత్తిపోశాయి. కాళేశ్వరం ప్రాజెక్ట్ కోసం కోట్లు ఖర్చుపెట్టామని చెప్పి నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నిర్మించారని ఆరోపించారు. అప్పట్లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సైతం ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డితో కలిసి కుంగిన మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించారు. అప్పటి బీఆర్ఎస్ సర్కార్‌పై విమర్శలు గుప్పించారు.

అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మేడిగడ్డకు సంబంధించి పూర్తి వివరాలను నీటిపారుదల శాఖ అధికారులు అందజేశారు. ఇటీవలే మంత్రులు కూడా మేడిగడ్డ బ్యారేజీని సందర్శించారు.





## కొంగొత్త రాజకీయాన్ని చూపిస్తున్న...

# రేవంతుడు

## ఒక్కడినే అన్న పదాన్ని పక్కనపెట్టి.... తామంతా అనే నినాదంతో దూసుకుపోతున్న వైనం

## హ్యాట్సాఫ్ అంటున్న తెలంగాణ ప్రజానీకం

హైదరాబాద్ : అంచనాలకు భిన్నంగా వ్యవహరిస్తూ.. అందరిని ఆశ్చర్యానికి గురి చేస్తున్నారు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. తాను సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన నాటి నుంచి ఇప్పటివరకు తీసుకున్న నిర్ణయాలు.. ఎంపికలు విమర్శలకు దూరంగా ఉంచటమే కాదు.. అందరి నోట బాగుందన్న మాట వచ్చేలా చేస్తున్నారు. తాజాగా మరోసారి తన మార్కును ఆయన ప్రదర్శించారు. దూకుడుతనం.. ఒంటెద్దు పోకడలతో రేవంత్ ఎలా నెగ్గుకు వస్తారన్న దానిపై బోలెడన్ని సందేహాలు వ్యక్తమవుతుంటే.. రేవంత్ మాత్రం అందుకు భిన్నంగా తనను తాను పూర్తిగా మార్చేసుకోవటమే కాదు.. తనలోని మార్పును ఆయనకు అత్యంత సన్నిహితంగా ఉండే వారు సైతం జీర్ణించుకోలేని రీతిలో వ్యవహరిస్తునన తీరు ఆసక్తికరంగా మారింది. ఎన్నికల వేళ తామిచ్చిన ఆరు గ్యారెంటీ హామీల అమలును వంద రోజుల్లో ప్రజలకు అందుబాటులోకి తెస్తామని ప్రకటించటం తెలిసిందే. ఈ ఆరు గ్యారెంటీలకు సంబంధించిన అర్హుల్ని ఎంపిక చేసేందుకు వీలుగా ఇటీవల దరఖాస్తుల్ని ఆహ్వానించటం.. భారీ ఎత్తున రావటం తెలిసిందే.

ఈ నేపథ్యంలో సెక్రటేరియట్ లో తాజాగా నిర్వహించిన రివ్యూలో కీలక నిర్ణయాన్ని తీసుకున్నారు. ప్రజాపాలనలో స్వీకరించిన అప్లికేషన్ల పరిశీలనను వేగవంతంగా పూర్తి చేయాలని.. పారదర్శకంగా జరటానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలిన సూచించారు. అంతేకాదు.. ఆరు గ్యారెంటీల అమలుకు సంబంధించి మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమిస్తూ ఆసక్తికర నిర్ణయాన్ని తీసుకోవటమే కాదు.. ఆరు గ్యారెంటీల అమలుపై తమ ప్రభుత్వానికి ఉన్న కమిట్ మెంట్ గురించి చెప్పకనే చెప్పేశారు. ఉప సంఘం ఛైర్మన్ గా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను నియమించిన సీఎం రేవంత్.. మంత్రులు శ్రీధర్ బాబు.. పొంగులేటి శ్రీనివాసరెడ్డిలను సభ్యులుగా నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. కీలక అంశం ఏమైనా సరే.. తాను ఒక్కడినే అన్నట్లు కాకుండా.. అందరు కలిసి కట్టుగా ఉండాలన్న సంకేతాన్ని ఇచ్చేలా రేవంత్ తన ప్రతి నిర్ణయంలోనూ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తాజాగా ఏర్పాటు చేసిన ఉప సంఘం కూడా అదే విషయాన్ని స్పష్టం చేస్తుందని చెప్పాలి. ఏమైనా.. తాము చెప్పిన వంద రోజుల్లో ఆరు హామీల్ని అమలు చేయటమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్న విషయాన్ని చేతలతో చెప్పేస్తున్న రేవంత్.. రానున్న రోజుల్లో ఇంకేం చేయనున్నారన్నది చూడాలి. ఏది ఏమైనప్పటికీ రేవంత్‌రెడ్డి అందరినీ కులుపుకుని పోతూ అభివృద్ధి దిశగా అడుగులు వేయడంపై తెలంగాణ ప్రజలు ప్రశంసిస్తున్నారని చెప్పక తప్పదు.

## సంపాదకీయం

# తెలంగాణలో ఆమె పోటీపై హైప్ హడావుడేనా?

అదిగో ఆమె మెదక్ నుంచి బరిలో దిగుతారు..? ఇదిగో మల్కాజిగిరి నుంచి పోటీ చేస్తారు.. కాదుకాదు చూడండి ఖమ్మం నుంచి రంగంలోకి దూకుతారు.. లేదులేదు అసలు ఈసారి ఆమె పోటీనే చేయరు.. అనారోగ్యంతో ప్రత్యక్ష రాజకీయాల నుంచి తప్పుకొంటున్నారు.. దేశంలో ఏ నాయకుడు, నాయకురాలి పోటీ గురించి రాని ఊహాగానాలు ఆమె విషయంలో వస్తున్నాయి.. వీటిలో నిజం ఏమిటో కానీ.. మీడియా హైప్ మాత్రం మామూలుగా లేదు. అసలు ఏ విషయమూ నిర్ధారణ కాకున్నా.. రోజుకో నియోజకవర్గం పేరును ప్రస్తావిస్తూ హడావుడి చేస్తోంది.

**వస్తే సంచలనమే..** తెలంగాణలో ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయదుందుభి మోగించింది. దీంతో దక్షిణాదిలో కర్ణాటక తర్వాత రెండో రాష్ట్రాన్ని ఖాతాలో వేసుకుంది. ఇక మిగిలింది కేరళనే. ఏపీపై ఎలాగూ ఆశలు లేవు. కాగా, ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ అగ్ర నేత సోనియా గాంధీ తెలంగాణ నుంచి ఎంపీగా పోటీ చేస్తారనే కథనాలు వస్తున్నాయి. టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సైతం.. తమ అగ్ర నేతను రాష్ట్రం నుంచి పోటీ చేయాలని కోరుతూ తీర్మానం చేసి పంపింది. మరోవైపు పీసీసీ సమావేశం కూడా ఈ మేరకు తీర్మానం చేసింది. అయితే, ఇంతకూ సోనియా ఎక్కడినుంచి బరిలో దిగుతారనేది మాత్రం స్పష్టం కాలేదు. 2004 నుంచి సోనియా వరుసగా ఐదుసార్లు (2006 ఉప ఎన్నిక సహా) యూపీలోని రాయ్ బరేలీ నుంచి ఎంపీగా ఎన్నికవుతూ వస్తున్నారు. తాజాగా తెలంగాణలో అధికారంలోకి వచ్చాక సోనియా మెదక్ నుంచి పోటీ చేస్తారని ప్రాచారం జరిగింది. దీనికితోడు ఆమె అత్తగారు ఇందిరాగాంధీ 1980లో మెదక్ నుంచి గెలిచారు. మెదక్ ఎంపీగా ఉండగానే ఆమె ప్రధాని బాధ్యతల్లో కొనసాగుతూ దారుణ హత్యకు గురయ్యారు. అలాంటి స్థానంలో సోనియా పోటీ అంటే అది సంచలనమే.

**వలస గుమ్మంలో..** తాజాగా సోనియాగాంధీ ఖమ్మం నుంచి లోక్ సభ బరిలో దిగుతారంటూ కథనాలు వస్తున్నాయి. ఖమ్మంలో ఎలాగూ బీఆర్ఎస్ బలహీనమే. కమ్యూనిస్టులు కాంగ్రెస్ వైపే ఉంటారు. కాంగ్రెస్ కు మొదటినుంచి ఖమ్మం జిల్లా పెట్టని కోట. ఇన్ని సమీకరణాల మధ్యన సోనియాగాంధీని ఖమ్మం నుంచి పోటీ చేయిస్తే సులువుగా గెలవచ్చని కూడా రాష్ట్ర నేతలు భావిస్తున్నారు. సోనియా తెలంగాణలో ఎక్కడ పోటీ చేసినా గెలుపు పక్కా. కానీ మెదక్ కంటే ఖమ్మం అయితే మరీ సులువు. ఎందుకంటే.. ప్రాంతాలకు అతీతంగా నాయకులను ఆదరించడం ఖమ్మం వాసుల లక్షణం. నాదెండ్ల భాస్కరరావు, రేణుకా చౌదరి ఇలానే ఎంపీలుగా గెలుపొందారు.

**తెలంగాణ ఇచ్చిన సోనియాపై పోటీ ఉంటుందా..? :** ఎవరెన్ని చెప్పినా తెలంగాణ ఏర్పాటుకు సోనియా గాంధీ పట్టుదలే కారణం. ఆమె లేకుంటే ప్రత్యేక రాష్ట్రం వచ్చేదే కాదనేది సత్యం. అలాంటి సోనియా గాంధీ తెలంగాణలో ఎంపీగా పోటీ చేస్తే పార్టీలకు అతీతంగా ఆమెకు ఓట్లు పడడం ఖాయం. బీఆర్ఎస్ శ్రేణులు సైతం సోనియాకే ఓటేస్తాయనడంలో సందేహం లేదు. సోనియాపై అసలు బీఆర్ఎస్ అభ్యర్థినే నిలపకపోవచ్చు కూడా. బీజేపీ మాత్రం కచ్చితంగా పెద్ద నాయకుడినే దింపే వీలుంటుంది.

# నెలాఖరులోపు సీఎంఆర్ కేటాయింపులను పూర్తి చేయాల్సిందే

### రైస్ మిల్లర్లకు తేల్చి చెప్పిన కలెక్టర్

### ఉల్లంఘనలకు పాల్పడే వారిపై క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరిక



నిజామాబాద్, జనవరి 09 : రైతుల నుండి ప్రభుత్వపరంగా కొనుగోలు చేసి సమకూర్చిన ధాన్యాన్ని వేగవంతంగా మిల్లింగ్ జరుపుతూ ఈ నెలాఖరులోగా నిర్దేశిత కోటాకు అనుగుణంగా కస్టమ్ మిల్లింగ్ రైస్ నిల్వలను భారత ఆహార సంస్థకు చేరవేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు రైస్ మిల్లర్లకు సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రతి రైస్ మిల్లులో పూర్తి సామర్ధ్యానికి అనుగుణంగా కస్టమ్ మిల్లింగ్ జరగాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ విషయంలో నిర్లక్ష్యానికి తావు కల్పిస్తూ, నిబంధనలను ఉల్లంఘించే రైస్ మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు కూడా వెనుకాడబోమని కలెక్టర్ కరాఖండీగా తేల్చి చెప్పారు. సీఎంఆర్ లక్ష్య సాధనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తున్న నేపథ్యంలో కలెక్టర్ మంగళవారం తన ఛాంబర్లో అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి, పౌర సరఫరాల శాఖ అధికారులు, ఎఫ్ సీ ఐ ఏరియా మేనేజర్ తదితరులతో కలిసి రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో సీఎంఆర్ కేటాయింపులపై కూలంకషంగా చర్చించారు. నిర్ణీత లక్ష్యం మేరకు మిల్లర్లు కస్టమ్ మిల్లింగ్ రైస్ ను అందించకపోవడం పట్ల కలెక్టర్ ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎంఆర్ కేటాయింపుల్లో జాప్యాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తున్నందున, ఇకపై మిల్లర్ల అలసత్వాన్ని తాము ఎంతమాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. జిల్లాలోని రైస్ మిల్లులలో ప్రతి రోజు కనీసం 6 వేల మెట్రిక్ టన్నుల మేర కస్టమ్ మిల్లింగ్ జరిపే సామర్ధ్యం ఉన్నప్పటికీ, సగటున కేవలం 2 వేల మెట్రిక్ టన్నుల వరకే మిల్లింగ్ జరుగుతోందని అసంతృప్తి వెలిబుచ్చారు. దాదాపు 35 వరకు మిల్లులు ఇంతవరకు అసలు సీ.ఎం.ఆర్ కేటాయింపులనే ప్రారంభించలేదని ఆక్షేపిస్తూ, నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టమైన హెచ్చరికలు చేశారు. తాము ఎలాంటి సాకులు వినదల్చుకోలేదని, అవసరమైతే ధాన్యాన్ని కొనుగోలు చేసి అయినా నిర్ణీత గడువులోపు లక్ష్యానికి అనుగుణంగా సీఎంఆర్ డెలివరీ చేయాలని మిల్లర్లకు తేల్చి చెప్పారు. జిల్లా వ్యాప్తంగా గల అన్ని రైస్ మిల్లులలో తప్పనిసరిగా పూర్తి స్థాయి సామర్ధ్యానికి అనుగుణంగా కస్టమ్ రైస్ మిల్లింగ్ జరుపుతూ, ఈ నెలాఖరు లోపు ఎఫ్ సీ ఐ కి నిల్వలు చేరవేయాలని గడువు విధించారు. అవసరమైతే ప్రైవేట్ ధాన్యం మిల్లింగ్ కు విరామం ఇచ్చి, సీ.ఎం.ఆర్ లక్ష్య సాధనపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, సాధ్యమైనంత వరకు ఎక్కువ మొత్తంలో బాయిల్డ్ రైస్ నిల్వలు అందించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని హితవు పలికారు.

క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు నెలకొని ఉంటే జిల్లా యంత్రాంగం తరపున తప్పనిసరిగా వాటిని పరిష్కరిస్తా మని అన్నారు. మిల్లర్లు పంపించే సీఎంఆర్ నిల్వలను వెంటదివెంట దిగుమతి చేసుకునేలా గోడౌన్ల వద్ద కూలీల సంఖ్య పెంచాలని, మిల్లర్లకు కోరిన వెంటనే గోడౌన్లలో బియ్యం దిగుమతి కోసం ఎక్కడ స్థలం అందుబాటులో ఉంటే అక్కడికి మిల్లర్లను అనుమతించాలని ఎఫ్.సీ.ఐ అధికారులకు కలెక్టర్ సూచించారు. కాగా, ఇప్పటికే 2022 - 2023 ఖరీఫ్, రబీ సీఎంఆర్ లక్ష్య సాధనకు చేరువలో ఉన్న రైస్ మిల్లులలో 2023 - 2024 ఖరీఫ్ సీజన్ కు సంబంధించి కూడా కస్టమ్ మిల్లింగ్ నిర్వహించేలా అనుమతించాలని పలువురు రైస్ మిల్లర్లు కోరగా, కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ ఈ మేరకు ఉన్నతాధికారులకు నివేదిస్తామని అన్నారు. ఈ సమావేశంలో డీఎస్ఓ చంద్రప్రకాష్, సివిల్ సప్లయిస్ డీ.ఎం జగదీశ్, ఎఫ్.సీ.ఐ ఏరియా మేనేజర్ వర్మ, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు వి.మోహన్ రెడ్డి, కాపర్తి శ్రవణ్, రైస్ మిల్లర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# శత శాతం లబ్ధిదారులు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు వినియోగించుకోవాలి

### - కేంద్ర ఆహార & ప్రజాపంపిణీ శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీ అశ్వని శ్రీవాస్తవ




నిజామాబాద్, జనవరి 09 : శత శాతం లబ్దిదారులు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు వినియోగించు కోవాలని కేంద్ర ఆహార అండ్ ప్రజాపంపిణీ శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీ అశ్వని శ్రీవాస్తవ అన్నారు.మంగళవారం ఇందల్వాయి మండలం, అన్సాన్ పల్లె గ్రామంలో కొనసాగిన వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాలలో పెద్ద సంఖ్యలో ప్రజలు భాగస్వాములయ్యారు. కేంద్ర ఆహార ప్రజాపంపిణీ శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీ అశ్వని శ్రీవాస్తవ ముఖ్య అతిథిగా విచ్చేయగా, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ బి.ధర్మ నాయక్, ఎల్ డిఎం శ్రీనివాస రావ్ తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ఆహార అండ్ ప్రజాపంపిణీ శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీ అశ్వని శ్రీవాస్తవ మాట్లాడుతూ....కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వంద శాతం లబ్ధిదారులకు అందించాలనే లక్ష్యంతో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందన్నారు. అర్హులై సంక్షేమ పథకాలు లబ్ధి పొందని వారు ఉండకూడదనేది ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ కేంద్ర పథకాల గురించి అవగాహన పెంపొందించుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పట్టణ మరియు గ్రామగ్రామాన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహిస్తోందని స్పష్టం చేశారు. పేద ప్రజలకు మౌలిక సదుపాయాలైన పారిశుద్ధ్యం, ఆర్థిక సహాయం, ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్లు, పక్కా ఇండ్లు, ఆహార భద్రత, పౌష్టికాహారం, వైద్యం, స్వచ్ఛమైన తాగునీరు, నాణ్యమైన విద్య అందించడంలో భాగంగా అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నదని, అర్హులైన లబ్ధిదారులు వాటిని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్ని వర్గాల వారు అభివృద్ధి చెందాలనే అకుంఠిత దీక్షతో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఆయా పథకాల ద్వారా ప్రయోజనం పొందిన వారిచే సభలో వారి అనుభవాలను, అనుభూతులను స్వయంగా వివరింపజేశారు. ప్రస్తుతం సంకల్ప యాత్ర ద్వారా మీ ముంగిటకు వచ్చిన అధికారులకు నేరుగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఇప్పటికే కేంద్ర పథకాల ద్వారా ప్రయోజనం పొందిన పలువురు లబ్ధిదారులతో మాట్లాడించారు. సంక్షేమ పథకాలకు సంబంధించిన వివరాలతో కూడిన కరపత్రాలు, గోడప్రతులు, క్యాలెండర్లను ఆవిష్కరించి, ప్రజలకు పంపిణీ చేశారు. ఉచిత ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందించారు.సంకల్ప యాత్ర కార్యక్రమాలలో యంపీడిఓ శ్రీరాములు, సర్పంచ్, డియల్ పిఓ, స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా, మండల్ అధికారులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

# జోడో న్యాయ యాత్రకు తరలిరండి: కాంగ్రెస్

న్యూఢిల్లీ : మణిపూర్‌లో ఈనెల 14 నుంచి ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ సారథ్యంలో చేపట్టే 'భారత్ జోడో న్యాయ యాత్ర'లో ప్రజలు, ప్రజా సంఘాలు, పౌర సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొనాల్సిందిగా కాంగ్రెస్ పిలుపునిచ్చింది. ప్రతి భారతీయుడికి ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయం అందించడమే లక్ష్యంగా రాహుల్ ఈ యాత్ర చేపడుతున్నట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ వెల్లడించారు. 'ప్రతి భారతీయుడికి అన్ని విషయాల్లో న్యాయం జరగాలన్న రాజ్యాంగ వాగ్దానాన్ని అందజేయాలనే నిబద్ధతను పటిష్ఠపరిచేందుకే ఈ యాత్ర' అని ఆయన 'ఎక్స్'లో పేర్కొన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు ముందు చేపడుతున్న ఈ యాత్ర 66 రోజులు సాగనుంది. మార్చి 20 లేదా 21న ముంబైలో ముగియనుంది. మొత్తం 110 జిల్లాలు, 100 లోక్‌సభ స్థానాలు, 337 అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా 6,713 కిలోమీటర్ల మేర యాత్ర సాగనుంది.

# అంగన్వాడి కేంద్రాలకు పౌష్టికాహారం పంపిణీ చేసినహెచ్ బి ఎల్ కంపెనీ

శామీర్ పేట (గరుడ వార్త) : అంగన్వాడి కేంద్రాలకు హెచ్ బీ ఎల్ కంపెనీ సహకారంతో పౌష్టికాహారం పంపిణీ చేశారు. మంగళవారం శామీర్ పేట మండలం తూముకుంట మున్సిపల్ పరిధిలోని ఉప్పరపల్లి, అంతాయిపల్లి, హకిం పేట, సింగరాయపల్లి అంగన్వాడి కేంద్రాలలో ప్రతిరోజు పాలు, చిక్కి పట్టి, అరటి పండ్లతో పాటు చిన్నారులకు రెండు జతల దుస్తులు అందజేయనున్నట్లు చెప్పారు. అలాగే అంగడివాని కేంద్రాలకు ఎల్ఈడి టీవీలను పంపిణీ



చేస్తున్నట్లు చెప్పారు. పిల్లలకి పాలు త్రాగడానికి కప్పులతో పాటు పలకలు , ప్రెషర్ కుక్కర్లు ,చాపలు ఇతర అవసరమైన వస్తువులను అంద చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ బి ఎల్ ప్రొడక్షన్ జనరల్ మేనేజర్ ఆర్ఎస్ సుధాకర్, విజయలక్ష్మి, సి ఎస్ ఆర్ అసోసియేటర్ కృష్ణంరాజు, సిఎస్ఆర్ కోఆర్డినేటర్ కల్పన, అంగన్వాడి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కృష్ణారెడ్డి, సిడిపిఓ ఉదయ్ శ్రీ, సూపర్వైజర్ పద్మ, కౌన్సిలర్ పాండు, అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# క్షేమంగా గమ్యస్థానాలకు చేరేందుకు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి...

### ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి

శామీర్ పేట (గరుడ వార్త) : ప్రమాదాల నివారణతో పాటు క్షేమంగా గమ్యస్థానాలకు చేరేందుకు ప్రతి ఒక్క వాహన చోదకుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని శామీర్ పేట ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి సూచించారు. మంగళవారం ప్రమాదాల నివారణ ముందస్తు చర్యల్లో భాగంగా రాజీవ్ రహదారిలోని ఆరంజ్ బౌల్ చౌరస్తా, నల్సార్ చౌరస్తా, అలియాబాద్ చౌరస్తా, మజీద్పూర్ చౌరస్తాల వద్ద నియంత్రణ రేడియం లైట్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ... ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ



వాహనాలు నడపాలన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ద్విచక్రవాహనాలు నడపాలని, అదేవిధంగా కార్లు నడిపేవారు సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# సంక్రాంతి సెలవులకు వెళ్లేవారు ముందస్తు సమాచారం ఇవ్వాలి

నిజామాబాద్ , జనవరి 09 : సంక్రాంతి పండుగ సెలవులకు వెళ్లే వారు ఈ దిగువ తెలియజేసిన నిబంధనలు తూ.చ తప్పక పాటించాలని నిజామాబాద్ జిల్లా కమిషనర్ కల్మేశ్వర్ శింగేనవార్ తెలిపారు.విలువైన వస్తువులను బంగారం మరియు డబ్బులు లాకర్ లో బద్రపరచాలని, సెంట్రల్ లాకింగ్ వాడలని, గ్రామాలలోని ప్రజలు సంబంధిత పోలీస్ స్టేషన్ వారికి ముందస్తు సమాచారం ఇవ్వలన్నారు.సి.సి.టి.విలు సరియైన విధంగా పనిచేసేటట్లు, మంచి కండిషన్ లో ఉండేవిధంగా చూచుకోవాలని,అపరిచిత వ్యక్తులు వస్తే వారి సమాచారం పోలీస్ వారికి తెలియజేయవలెనని, శివారు ప్రాంత కాలనీలలో తాళం వేసిన ఇండ్లను అపరిచిత వ్యక్తులు ఉదయం వేళ వెతకటం, రాత్రి వేళ చోరీలకు పాల్పడటం జరుగుతుందని అట్టి వారిపై నిఘా ఏర్పాటు చేయలని,ఇరుగు పొరుగు



వారిని ఇంటిని కనిపెట్టి ఉండమని చెప్పలన్నారు.పక్కింటి వారి ద్వారా ఇంటికి సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకోవడం మంచిదన్నారు.ఇంట్లో కుటుంబ సభ్యులు వెళ్లగా ఉన్న మహిళలు, వృద్ధులు అపరిచితులు సమాచారం పేరుతో వస్తే నమ్మద్దొని, ఊరు వెళ్లేటప్పుడు ఖరీదైన వస్తువులు ఉంచకపోవడమే మంచిది (లేదా) బ్యాంక్ లాకర్ లో పెట్టుకోవడం మంచిదని,. కాలనీల వారిగా గస్తీ దళాలను ఏర్పాటు చేసుకోవాలని, తాళం వేసి ఊరు వెళ్లే ముందు మీ సమీప పోలీస్ స్టేషన్లో సమాచారం అందించలన్నారు. పోలీస్ శాఖ వారికి దొంగతనాలపై అనుమానితుల సమాచారం అందించి దొంగతనాల నివారణకు సహకరించలన్నారు. ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వదలుచుకునేవారు మీ సమీప పోలీస్ స్టేషన్లను సంప్రదించండి. లేదా డయల్ 100 ను సద్వినియోగం చేసుకోవలన్నారు.

## చేనేత వస్త్రాలు పేరుకుపోతున్నాయ్..!

చౌటుప్పల్ : రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితి ఒకప్పుడు చేనేత కార్మికులకు ఉండేది. ఇప్పుడు రోజంతా కష్టపడ్డా కడుపు నిండటం లేదని వారు ఆవేదన చెందుతున్నారు. తాము నేసిన వస్త్రాలు అమ్ముడుపోవడం లేదని, అవి చేనేత సహకార సంఘాల్లోనే నిల్వ ఉంటున్నాయని వాపోతున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో 72 చేనేత సహకార సంఘాలున్నాయి. వీటిలో 32 వేల మంది చేనేత కార్మికులు సభ్యులుగా ఉన్నారు. వీరు మగ్గాలపై నేసిన సుమారు రూ.10 కోట్ల విలువైన వస్త్రాలు నిల్వ ఉన్నాయి. వాటిని సహకార సంఘాల నుంచి 'టెస్కో' కొనుగోలు చేసి వారి షోరూముల్లో, ఇతర సంస్థలకు అమ్మాల్సి ఉంది. 'టెస్కో' అధికారులు గతంలో నగదు చెల్లించి వస్త్రాలను కొనుగోలు చేసేవారు. ఆ నగదును వస్త్రాలను నేసిన చేనేత కార్మికులకు పంపిణీ చేసేవారు. ఇప్పుడు టెస్కో అధికారులు సహకార సంఘాల వైపే రావడం లేదు. దీంతో చేనేత కార్మికులు చేతిలో పని లేక, నేసిన వస్త్రాలను కొనేవారు లేక ఆందోళన చెందుతున్నారు. నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వం తమను ఆదుకుంటుందని, నిల్వ ఉన్న వస్త్రాలన్నీ టెస్కో ద్వారా కొనుగోలు చేయిస్తుందని ఆశతో ఎదురు చూస్తున్నారు.

రూ.కోటిన్నర విలువైన వస్త్రాలు నిల్వ ఉన్నాయి

గుర్రం వెంకటేశ్వర్లు, డైరెక్టర్, చేనేత సహకార సంఘం



జిల్లాలో మొట్టమొదట ఏర్పాటైన కొయ్యలగూడెం చేనేత సహకార సంఘంలో 590 మంది సభ్యులు ఉన్నారు. మేము నేసిన వస్త్రాలు అమెరికా అధ్యక్షుడి భవనం వైట్‌హౌస్ అలంకరణకు వాడుతున్నారు. అలాంటి నాణ్యమైన వస్త్రాలు దాదాపు రూ.కోటిన్నర విలువైనవి మా సంఘంలో చాలా నెలలుగా నిల్వ ఉన్నాయి. వీటిని టెస్కో కొనుగోలు చేస్తుందని ఆశతో ఎదురు చూస్తున్నాం. వస్త్రాలు అమ్ముడుపోతేనే మా కార్మికులకు పని, కూలి లభిస్తుంది.

అందరికీ పని కల్పించలేకపోతున్నాం

పొట్టబత్తిని హరేకృష్ణ, అకౌంటెంట్

మా సహకార సంఘంలోని సభ్యులు ఏటా రూ.3 కోట్ల విలువైన వస్త్రాలను ఉత్పత్తి చేయగలరు. టెస్కో సంస్థ ఏటా రూ.కోటి విలువైన వస్త్రాలు తయారు చేయడానికి మాకు వర్క్ ఆర్డర్ ఇస్తుంది. అలా తయారు చేసిన వస్త్రాల్లో రూ.40 లక్షలవి మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. మిగతా వస్త్రాలు మా గోదాములోనే నిల్వ ఉంటున్నాయి. మా సంఘానికి నాబార్డ్ క్యాష్ క్రెడిట్ రూ.80 లక్షలుంది. అవి సరిపోవడం లేదు. కార్మికులకు పని, కూలి ఇవ్వలేకపోతున్నాం.

ప్రభుత్వం సాయం చేయాలని విన్నపం

రాపోలు అంజయ్య, చేనేత కార్మికుడు

నా వయసు 72 ఏళ్లు. పన్నెండేళ్ల వయసు నుంచి చేనేత పని చేస్తున్నాను. ఇప్పటికీ సొంత పెట్టుబడి లేక నేను కూలికి మగ్గం నేస్తున్నాను. ప్రభుత్వం చేనేతకు ఎంతో సాయం చేస్తున్నట్లు ప్రకటిస్తుంది. అది మా కుటుంబం దాకా రాలేదు. సంతానం ఎవరి దారి వాళ్లు చూసుకున్నారు. నేను, నా భార్య ఇద్దరమే పట్టు చీరలు నేస్తూ ఇక్కడ ఉంటున్నాం. రేషన్ కార్డు లేనందున ప్రభుత్వ పథకమేదీ మాకు అందడం లేదు.

## చెరువులు నిండి.. పొలాల్లోకి చేరి..

కొండపాక : గ్రామాల్లోని చెరువులు నీటితో నిండితే సాగు నీరుకు ఇబ్బందులు ఉండవని రైతులు హర్షం వ్యక్తం చేస్తారు. కుకునూరుపల్లి మండలం మంగోల్ గ్రామంలోని రెండు ప్రధాన చెరువులైన దుద్దె, నల్ల చెరువులు నిండి మత్తడి పారుతున్నా.. చెరువు కింద పంటలు సాగుచేస్తున్న రైతులు మాత్రం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నీరు లీకవడంతో..మల్లన్నసాగర్ జలాశయం ఆధారితంగా కుకునూరుపల్లి మండలం మంగోల్ గ్రామంలో 540 ఎంఎల్‌డీల సామర్థ్యంతో మిషన్ భగీరథ తాగునీటి శుద్ధి కేంద్రంను నిర్మించారు. శుద్ధి కేంద్రం నుంచి ఏడు జిల్లాలు సిద్దిపేట, జనగామ, మేడ్చల్, భువనగిరి, మెదక్, సూర్యాపేట, మహబూబాబాద్, 10 అసెంబ్లీ నియోజకవర్గాలు, 16 పట్టణాలు, 1922 ఆవాసాలకు నిరంతరం తాగునీరు సరఫరా అవుతోంది. అందుకు ఇక్కడ జలాల శుద్ధ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతోంది. ఈ క్రమంలో భారీ మొత్తంలో వ్యర్థ జలాలు శుద్ధి కేంద్రం నుంచి బయటకు విడుదల అవుతున్నాయి. ఈ నీటిని సద్వినియోగం చేసుకోవడానికి పిల్ల కాలువలు నిర్మించి గ్రావిటీ ద్వారా మంగోల్‌లోని దుద్దె, నల్ల చెరువులకు జలాలను మళ్లించారు. రెండు చెరువుల్లోకి నిరంతరం నీరు చేరడంతో అవి కొంతకాలంగా మత్తడి పారుతున్నాయి. మిగులు జలాలను పొలాల్లోకి వెళ్లకుండా మళ్లీ



మల్లన్నసాగర్ కాలువల్లోకి మళ్లించారు. ఇంతవరకు బాగానే ఉన్నా గత ఆరు నెలలుగా రెండు చెరువులు మత్తడి పారడంతో ప్రస్తుతం రెండు చెరువు కట్టల కింది నుంచి నీరు బయటకు లీకవుతోంది. నల్ల చెరువుకు చిన్నపాటి బుంగ ఏర్పడి చెరువు నుంచి నీరు వృథాగా బయటకు వస్తుందని రైతులు అంటున్నారు. చెరువు కింద పంటలు సాగుచేస్తున్న రైతుల పొలాల్లోకి ఆ నీరు చేరుతోంది. దీంతో వరి కోతలు చేపట్టలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చైన్ వరికోత యంత్రాలే దిక్కని రైతులు వాపోతున్నారు. చెరువుల నుంచి నీరు బయటకు రాకుండా సంబంధిత శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఆందోళన అవసరం లేదు–శ్రీనివాస్‌రావు, ఏఈ ఇరిగేషన్, కుకునూరుపల్లిచెరువులు నిండుగా ఉన్నప్పుడు నీరు కొద్దిగా బయటకు వస్తుంది. దీంతో చెరువు కట్టలకు ఎలాంటి సమస్యలు ఉండవు. ఎక్కడైనా బుంగలు పడితే వెంటనే తగిన చర్యలు చేపడతాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అవసరమైతే మరోసారి రెండు చెరువు కట్టలను పరిశీలించి తగు జాగ్రత్తలు తీసుకుంటాం.

## గృహ నిర్మాణ శాఖకు పునరుజ్జీవం



మిర్యాలగూడ : తెలంగాణలో నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలనే సంకల్పంతో గృహనిర్మాణ శాఖను తిరిగి ప్రారంభించాలని నిర్ణయించింది. దీంతో ఆ శాఖలో గతంలో పనిచేసిన ఉద్యోగులు, తాత్కాలిక సిబ్బందిలో ఆశలు చిగురిస్తున్నాయి. 2014లో తెలంగాణలో తెరాస(భారాస) ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ఇందిరమ్మ ఇళ్లలో జరిగిన అక్రమాలపై సీఐడీ విచారణ జరిపించి గృహనిర్మాణ శాఖను ఎత్తివేశారు. దీంతో ఆ శాఖలో పనిచేస్తున్న శాశ్వత ఉద్యోగులను ఇతర 12 ప్రభుత్వ శాఖల్లో ఇంజినీరింగ్ విభాగాల్లో సర్దుబాటు చేయగా, తాత్కాలిక సిబ్బందిని విధుల నుంచి తొలగించారు. 2015లో తెలంగాణ ప్రభుత్వం రెండు పడకల ఇళ్ల పథకం ప్రారంభించటంతో పూర్తిగా గృహనిర్మాణ శాఖ ఇతర శాఖల్లో విలీనం చేశారు. 2018 తరువాత గృహ నిర్మాణ శాఖలో ఇంజినీర్లను రహదారులు భవనాల శాఖలోకి మార్పిడి చేశారు.

పరిస్థితి..ఉమ్మడి జిల్లాలో 59 మండలాల్లో గృహనిర్మాణ శాఖ ఏఈ కార్యాలయాలు ఉండగా, నియోజకవర్గానికి ఒకరు చొప్పున 12 మంది డీఈలు, 5 రెవెన్యూ డివిజన్‌లకు ఒకరు చొప్పున ఐదుగురు ఈఈలు, జిల్లా స్థాయిలో గృహనిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఉండేవారు. వీరితో పాటుగా ప్రధాన పట్టణాల్లో పట్టణ ఏఈలు సైతం మిర్యాలగూడ, భువనగిరి, నల్గొండ, సూర్యాపేట దేవరకొండలో ఉండేవి. మండలానికి నలుగురు చొప్పున వర్క్ ఇన్‌స్పెక్టర్‌లు, కంప్యూటర్ సిబ్బంది విధులు నిర్వర్తించే వారు. వీరిలో తాత్కాలిక ప్రాతిపదికన నియమించిన వారిని విధుల నుంచి తొలగించారు.

ఆశతో పేదలు..తెలంగాణ ఏర్పాటుకు ముందు గృహనిర్మాణ శాఖను జిల్లాకు చెందిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిర్వహించేవారు. మిర్యాలగూడ పట్టణంలో ఇందిరమ్మ కాలనీ పేరుతో చింతపల్లి మార్గంలో ఆరు లేఅవుట్‌లు ఏర్పాటు చేసి ఐదువేల వరకు ఇళ్లను నిర్మించారు.

తక్కువ వ్యయంతో రెండు పడకల ఇళ్లు నిర్మాణం జరిపిస్తామని గృహనిర్మాణ శాఖ అధికారులు మిర్యాలగూడ పట్టణంలోని 'ఇందిరమ్మ కాలనీ'లో సుమారు రూ.2.20 లక్షల వ్యయంతో రెండు పడకల ఇంటిని 'మోడల్ హౌజ్'గా నిర్మించారు. ప్రస్తుతం ఈ భవనం ఖాళీగా ఉంది. ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల లేఅవుట్ల తరహాలో ప్రైవేటు వెంచర్లకు ధీటుగా ఇందిరమ్మ ఇళ్లను నిర్మించారు. హుజూర్‌నగర్‌లో రాష్ట్రంలోనే 'మోడల్ ప్రాజెక్టు' సుమారు రూ.130 కోట్ల వ్యయంతో ఇందిరమ్మ ఇళ్ల సముదాయాల నిర్మాణం ప్రారంభించి సుమారు రూ.65 కోట్లు వ్యయం చేసి నిర్మాణాలు జరిపారు. తెలంగాణ ఏర్పాటు తరువాత దీనికి నిధులు కేటాయించక పోగా నిర్మాణాలు నిలిచిపోయాయి. ప్రస్తుతం గృహనిర్మాణ శాఖ ఏర్పాటు చేసే సన్నాహాలు జరుగుతుండగా ఈ ప్రాజెక్టు సైతం ప్రారంభిస్తారని పేదలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

## స్వచ్ఛతలో ముందంజ




కరీంనగర్ : కేంద్ర పట్టణాభివృద్ధి సంస్థ, స్వచ్ఛభారత్ మిషన్ ఆధ్వర్యంలో ఏటా నిర్వహిస్తున్న 'స్వచ్ఛ సర్వేక్షణ్–2023' సర్వేలో పోటీకి నగర పాలిక ముందడుగు వేసింది. దేశంలోని మహా నగరాలకు దీటుగా వాటర్౦ గుర్తింపు సాధించింది. కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నగరాలు, పట్టణాల్లో పోటీ నిర్వహించి పలు విభాగాలకు ర్యాంకులు ప్రకటిస్తోంది. బహిరంగ మలమూత్ర విసర్జన చేయకుండా సులభ్‌కాంప్లెక్స్‌లు, మురుగునీటి కాల్వలు శుభ్రంగా ఉంచడంలో కరీంనగర్ బల్దియా చర్యలు చేపట్టింది. వరుసగా తన స్థానాన్ని పదిలపర్చుకుంటుండగా గతేడాది ఓడీఎఫ్౦లో ఉండగా ఈ ఏడాది వాటర్ ప్లస్ సాధించి మరో అడుగు ముందుకేసింది.

382 నగరాలతో పోటీ

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో 4354 పట్టణాలు పోటీలో ఉన్నాయి. దేశవ్యాప్తంగా వాటర్౦లో 382 నగరాలు పోటీ పడగా 35 నగరాలు ఎంపిక అయ్యాయి. దక్షిణ భారతదేశంలో ఏడు పురపాలికలు ఉండగా తెలంగాణ నుంచి కరీంనగర్ మొదటిస్థానంలో, ఆ తర్వాత హైదరాబాద్ ఉంది. మిగతా నగరాలు ఓడీఎఫ్౦, ౦తోనే సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ప్లస్ ర్యాంకుతో పెరగనున్న మార్కులు

మురుగురహితంగా తీర్చిదిద్దే నగరాలకు స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మార్కులు కలిసి రానున్నాయి. మొత్తం 9,500 మార్కులుండగా ఇందులో వాటర్౦ సర్టిఫికేషన్‌కు 1125 మార్కులు రానున్నాయి. సులువుగా వచ్చిన మార్కులతో ర్యాంకు మెరుగ్గా ఉండనుంది. ఇండోర్, హైదరాబాద్, వైజాగ్ వంటి నగరాలు ప్లస్ ర్యాంకులలో ఉండి ఎక్కువ మార్కులు సాధిస్తుండగా అందులో కరీంనగర్ నగరపాలిక కూడా చేరింది. ఇప్పటికే సఫాయిమిత్ర సురక్ష ఛాలెంజ్‌లో రూ.4 కోట్ల నగదు అవార్డును సాధించి దేశంలోనే పేరుగాంచింది.

మురుగునీటి శుద్ధి కేంద్రం

భూగర్భ మురుగునీటి శుద్ధి కేంద్రం(ఎస్టీపీ) నగరానికి కలిసొస్తుంది. దీనిని వినియోగిస్తుండటంతో మార్కులు, ర్యాంకులు వస్తున్నాయి. 38 ఎంఎల్‌డీల సామర్థ్యంతో ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఉండగా రోజుకు రెండు ఎంఎల్‌డీల మురుగునీటిని శుద్ధి చేసి ఆ నీటిని ఇతర అవసరాలకు వాడుతున్నారు. సెప్టిక్ ట్యాంకర్ ద్వారా వచ్చే మానవ వ్యర్థాలను కూడా ఎఫ్ఎస్టీపీ ద్వారా శుద్ధి చేస్తున్నారు. ప్రత్యేక కాల్‌సెంటర్ నంబర్ కేటాయించి ప్రజలకు అవగాహన కల్పించారు. 28 ఎంఎల్‌డీల మురుగునీరు వస్తుండగా అందులో చెత్తా చెదారం లేకుండా ప్రవహించేలా చర్యలు తీసుకుంటూ ఎస్టీపీలో శుద్ధి చేస్తున్నారు.

స్మార్ట్ మరుగుదొడ్లు నగరవ్యాప్తంగా సులభ్‌కాంప్లెక్స్‌లు, సామాజిక మరుగుదొడ్లు అందుబాటులోకి తెచ్చారు. అన్ని రకాల సౌకర్యాలు కల్పించడంతో వీటిని వినియోగించుకోవడం పెరిగింది. ఇటీవల 14 చోట్ల కొత్తగా నిర్మించారు. మహిళలకు, పిల్లలకు, దివ్యాంగులకు, పాలిచ్చే తల్లులకు, డైపర్లు మార్చుకోవడానికి గదులు వేర్వేరుగా ఉన్నాయి. మొబైల్ బస్సు, మహిళలకు షీ టాయిలెట్లు వినియోగంలోకి వచ్చాయి. పారిశుద్ధ్య పనులకు వాహనాలు

పారిశుద్ధ్య పనుల నిర్వహణలో వ్యర్థాల శుద్ధికి వాహనాలు, యంత్రాల వినియోగం ఎక్కువగా ఉండేలా చర్యలు చేపట్టారు. మ్యాన్‌హోల్స్ శుభ్రం చేసేందుకు జెట్టింగ్ మిషన్ వాడుతున్నారు. సెప్టిక్ ట్యాంకులు శుభ్రం చేయడానికి ప్రైవేటుగా నగరంలో 14 సెప్టిక్ ట్యాంకర్ క్లీనింగ్ వాహనాలు ఉన్నాయి. వీటితోనే ఇళ్లలోని సెప్టిక్ ట్యాంకులను శుభ్రం చేస్తున్నారు.

## పెరుగుతున్న ఆయిల్‌పామ్ సాగు

జగిత్యాల : ఆయిల్‌పామ్ సాగుపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టిసారించి నాలుగు జిల్లాల్లో 1.31 లక్షల ఎకరాల్లో నాటాలని నిర్ణయించాయి. ఆయిల్‌ఫెడ్ నుంచి అనుమతులు పొందిన కంపెనీలు విదేశాల నుంచి విత్తనాలను తెప్పించి ఆయా జిల్లాల్లో నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలను పెంచి రైతులకు పంపిణీ చేస్తున్నారు. బిందుసేద్య పరికరాలు, మొక్కలకు తమవంతు వాటా డీడీలు తీసిచ్చిన రైతులకు మొక్కలను పంపిణీ చేస్తున్నట్లు ఉద్యానశాఖ అధికారి జె.ప్రతాప్‌సింగ్ తెలిపారు.

ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనే గానుగ(క్రషింగ్ ద్వారా నూనెతీసే) పరిశ్రమలున్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనూ వచ్చే సంవత్సరం నుంచి పంట దిగుబడి మొదలవుతుంది. కాబట్టి ఉమ్మడి జిల్లాలోనే గెలల క్రషింగ్ యూనిట్ నిర్మాణం చేపడితే పంట మార్కెట్కు వచ్చేసరికి సిద్ధమవుతుంది. మొక్కలు నాటి కొన్నేళ్లు పెంచిన తరువాత గెలల అమ్మకంలో ఇబ్బంది, ధరలో తగ్గుదల రాకుండా ప్రభుత్వం మధ్యవర్తిత్వంతో కంపెనీలతో దీర్ఘకాలిక ఒప్పంద చర్యలుండాలి.

ప్రభుత్వ ప్రోత్సాహంగా ఆయిల్‌పామ్ సాగుకు డ్రిప్, మొక్కలు, నిర్వహణ ఖర్చు తదితరాలకు హెక్టారుకు రూ.50 వేల వరకు రాయితీని నాలుగేళ్లలో ఇవ్వనుండగా ఈ మొత్తాన్ని సకాలంలో అందించాల్సి ఉంది. మనప్రాంత రైతులకు సాగు అనుభవంలేని పంటకాబట్టి భారత ఆయిల్‌పామ్ పరిశోధనసంస్థ, ప్రైవేటు కంపెనీల శాస్త్రవేత్తలు, ఉద్యాన, వ్యవసాయశాఖల అధికారులు రైతుల తోటలను ఎప్పటికప్పుడు సందర్శించి పురుగులు, తెగుళ్ల నిరోధం, మొక్కల ఎదుగుదలను, అంతరపంటల సాగును రైతులకు తెలపాలి.

వడ్ల అమ్మకం సమస్యలు, మామిడిలో చీడపీడలు, ఇతర పంటల సాగులోనూ వన్యప్రాణుల బెడద, కూలీల కొరత, ఉత్పత్తుల విక్రయ సమస్యలు తదితరాలతో ఉమ్మడి జిల్లాలో పెద్దఎత్తున రైతులు ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తిగా ఉండగా ప్రభుత్వ ప్రోత్సాహంతో ప్రైవేటు కంపెనీలు ముందుకు సాగుతున్నాయి. గెలల అమ్మకం, ధరల తగ్గుదల, విక్రయ సమస్యలు తలెత్తకుండా చూడాలి. ఆయిల్‌పామ్ మొక్కలు నాటిన 5 ఏళ్ల నుంచి ఎకరాకు రూ.40,000 నుంచి రూ.42,000 వరకు పంట రుణాన్ని ఇవ్వనుండగా అయిదేళ్లనుంచి కాకుండా తొలి సంవత్సరం నుంచే ఆయిల్‌పామ్ రైతులకు పంట రుణాన్ని మంజూరివ్వాలి, పంటలబీమాను వర్తింపచేయాలి.

## మరమ్మతులతోనే చివరికి నీరు

సారంగాపూర్ : చివరి తడులు చివరి గ్రామాల వరకు నీరు చేరకపోవడంతో చేతికందే సమయంలో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రధాన కాలువలతోపాటు ఉప కాలువల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. సారంగాపూర్ మండలంలోని 12ఎల్‌కు రెండు ప్రాంతాల్లో, 1ఆర్ మూడు ప్రాంతాల్లో, బీర్‌పూర్ మండలంలోని చర్లపల్లి, ఆర్‌వీ మెయిన్ కాలువలు పలు ప్రాంతాల్లో కూలిపోయాయి. అంతేకాకుండా కాలువలు పూర్తిగా పూడికతో నిండిపోవడమే కాకుండా అనేక ప్రాంతాల్లో సిమెంట్ లైనింగ్‌తోపాటు కాలువలు కూలిపోయినప్పటికీ మరమ్మతు చేపట్టడంలేదు. అలాగే ప్రతి తూము వద్ద గతంలో షట్టర్లు ఉంటుండగా ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. దాదాపు అన్ని తూములకు షట్టర్లు లేకుండా పోయాయి. దీనివల్ల యాసంగి పంట సాగు సమయంలో పైప్రాంతంలో నీరు వృథాగా పోతుండగా కింది ఆయకట్టు రైతులకు నీరందడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధిలో పూడిక తొలగిస్తే మేలు ప్రస్తుతం యాసంగి పంటలకు సాగునీటి విడుదల ప్రారంభం కాకపోవడంతో కాలువల్లోని పూడిక మట్టి, పిచ్చిమొక్కలను ఉపాధి హామీ పథకం ద్వారా తొలగిస్తే చివరి వరకు నీరు చేరుకునే అవకాశముంది. గతంలో ఏటా ఉపాధి కూలీల ద్వారా పూడికమట్టిని తొలగిస్తే కొంత రైతులకు ఉపశమనం కలగడమే కాకుండా కూలీలకు ఉపాధి లభించేది. వర్షాకాలంలో పలు ప్రాంతాల్లో కాలువలకు గండ్లు పడడంతో అలాగే ఉండిపోయాయి. వర్షాకాలం



పంటకు రైతులకు నీరు ఎక్కువగా అవసరం లేకపోవడంతో ఇబ్బంది తలెత్తలేదు. యాసంగి పంట కాలం ప్రారంభమైనందున ముందస్తుగానే పనులు చేపట్టినట్లయితే చివరి గ్రామాలకు నీరందే అవకాశముంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

షట్టరు బిగిస్తేనే పూర్తి స్థాయిలో సాగు నీరు

బీర్‌పూర్ రోళ్లవాగు ప్రాజెక్టు ఆధునికీకరణలో భాగంగా నూతనంగా ఏర్పాటు చేసిన తూముకు షట్టరు బిగించినప్పుడే పూర్తి స్థాయిలో నీటినిలువ సామర్థ్యం వీలవుతుంది. గతంలో 0.25 టీఎంసీ నింపేందుకు ఉన్న డీ–53ప్రధాన కాలువ నుంచి 12ఎల్ ద్వారా 250 క్యూసెక్కుల నీటిని తీసుకెళ్లి నింపే అవకాశముంది. ప్రస్తుతం నీటి నిలువ సామర్థ్యం పెరగడంతో గతంలో ఉన్న కాలువ ద్వారా నీటిని నింపడం ఇబ్బందిగా మారింది. అంతేకాకుండా ఎస్సారెస్పీ ప్రాజెక్టు నుంచి వారబందీ పద్ధతిలో నీటిని విడుదల చేస్తుండడంతో రోళ్లవాగు ప్రాజెక్టులోకి నీటిని నింపడం అధికారులకు తలనొప్పిగా మారుతుంది. 12ఎల్ కాలువపై సారంగాపూర్ మండలం పరిధిలోని 1ఆర్ కాలువ ద్వారా రేచపల్లి, సారంగాపూర్, బట్టపల్లి, పోతారం గ్రామాల రైతులకు సాగు నీరు అందించాల్సి ఉంటుంది. దీనివల్ల వారం రోజుల్లో రోళ్లవాగు ప్రాజెక్టు కనీస నీటినిలువ సామర్థ్యం చేరుకోవడంలేదు. అంతేకాకుండా ప్రాజెక్టు పై ప్రాంతంలో నిర్మించిన చర్లపల్లి బుగ్గ చెరువు తూము నుంచి నీరు వెళ్లేందుకు కనీస నిలువ సామర్థ్యం ఉన్నప్పుడే వీలవుతుంది. అయితే షట్టరు బిగించకపోవడంతో రైతులకు నీరు చేరుకోవడం ఇబ్బందిగా మారనుంది. అధికారులు చివరి ఆయకట్టు రైతులకు నీరు చేరేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సిన అవసరముంది.

ఇబ్బందులు లేకుండా చూస్తాం..

– చక్రునాయక్, డీఈఈ నీటిపారుదలశాఖవర్షాకాలం కాలువలకు గండి పడిన ప్రాంతాల్లో మరమ్మతు చేపడతాం. కాలువలల్లో పూడిక, పిచ్చిమొక్కల తొలగింపు ఉపాధి హామీలో చేపట్టాలని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కాలువల మొదట ఉన్న రైతులు నీటిని పొదుపుగా వాడుకుంటేనే చివరి ఆయకట్టు రైతులకు నీరందే అవకాశం ఉంటుంది. రోళ్లవాగు ప్రాజెక్టు తూముకు షట్టరు బిగించికపోయినప్పటికీ రైతులకు సాగునీటి ఇబ్బంది లేకుండా చూస్తాం.

## గుట్టను తొలిచేస్తున్నారు

సిరిసిల్ల : అడ్డగోలు తవ్వకాలు, అక్రమార్కుల బరితెగింపుతో కొండలు కరిగిపోతున్నాయి. ఖబ్రస్థాన్, డంపింగ్ యార్డు ఇలా దేనినీ వదలడం లేదు. ఇంత జరుగుతున్నా ఇదేమిటని అడిగే పరిస్థితే కనిపించడం లేదు. నిబంధనలు పక్కన పెట్టి, ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు. ఇదంతా కలెక్టరేట్‌కు కూత వేటు దూరంలోనే జరుగుతున్నా పట్టించుకున్న నాథుడు కనిపించడం లేదు.

సిరిసిల్ల పట్టణ శివారు రగుడులో కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలోని గుట్టలను తొలచివేస్తున్నారు. దీనికి సమీపంలో సిరిసిల్ల పట్టణానికి చెందిన డంపింగ్‌యార్డు, వీధి కుక్కల సంరక్షణ కేంద్రం, ముస్లింల ఖబ్రస్థాన్ ఉంది. అయినా అక్రమార్కులకు అవేమీ పట్టడం లేదు. యంత్రాలతో గుట్టను గుల్ల చేస్తున్నారు. పగలు తవ్వకాలు జరుపుతుంటే స్థానికులు కొందరు అడ్డుకోవడంతో మిన్నకుండిపోయారు. ప్రస్తుతం ప్రభుత్వ సెలవు రోజులు, రాత్రిళ్లు తవ్వకాలు సాగిస్తున్నారు. పచ్చని కొండ ప్రాంతం నేడు రాళ్లతో గోతులమయమైంది.

అంతా అనధికారమేమట్టిని తరలించడానికి విధిగా రెవెన్యూ, గనులు, భూగర్భశాఖల అధికారుల అనుమతి అవసరం. జిల్లా వ్యాప్తంగా ఎక్కడా ప్రభుత్వం మట్టి క్వారీలకు అనుమతి ఇవ్వలేదు. ప్రభుత్వం అనుమతి లేకపోయినా, బహిరంగంగా తరలిస్తున్నారు. ప్రభుత్వ నిర్మాణాలకు, స్థానిక అవసరాలకు అధికారుల అనుమతితో వేబిల్లులు చెల్లిస్తే పర్వాలేదు. ఇక్కడ తవ్విన మట్టిని స్థిరాస్తి వ్యాపారులకు, స్థానిక అవసరాలకు లెక్కలు కట్టి విక్రయిస్తున్నారు. ఇదే అనుమతి తీసుకుని నిర్వహిస్తే ప్రభుత్వానికి ఆదాయం సమకూరేది. సిరిసిల్ల–కరీంనగర్ ప్రధాన రహదారి సమీపంలో తవ్వుతున్న మట్టిని సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో స్థిరాస్తి వ్యాపారులు ఏర్పాటు చేసే వెంచర్లకు తరలిస్తున్నారు. కలెక్టరేట్‌కు కూతవేటు దూరం నుంచే మట్టిని తరలిస్తున్నా ఇప్పటికీ పురపాలక, రెవెన్యూ అధికారులు ఇక్కడికి వెళ్లి పరిశీలించిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. అనుమతులు లేవు– సైదులు, గనులు, భూగర్భశాఖ అధికారిప్రభుత్వ పనులకైనా మట్టి తవ్వకాలకు అనుమతి తీసుకోవడం తప్పనిసరి. జిల్లా వ్యాప్తంగా మట్టి తవ్వకాలకు ఎక్కడా అనుమతి లేదు. రెవెన్యూ అధికారులు అనుమతి ఇస్తే పరిశీలించి వేబిల్లులు జారీ చేస్తాం. రగుడు సమీపంలోనూ మట్టి తవ్వకాలకు అనుమతి ఇవ్వలేదు.

# నగర పాలన.. ప్రక్షాళన

హైదరాబాద్ : రాజధాని పరిధిలోని స్థానిక పాలనా సంస్థల్లో అధికారుల బదిలీల ప్రక్షాళనను రాష్ట్ర ప్రభుత్వం మొదలుపెట్టింది. అనేక ఏళ్లుగా ఒకేచోట విధులు నిర్వహిస్తున్న ముఖ్యమైన అధికారులను బదిలీ చేస్తోంది. పదవీ విరమణ చేసినా కొన్నేళ్లుగా అక్కడే ఉంటున్న అధికారులను కూడా ఇంటికి పంపించాలని నిర్ణయించింది. దీనికి సంబంధించిన జాబితా రాష్ట్ర ప్రభుత్వానికి చేరిందని తెలిసింది. జీహెచ్ఎంసీలో జోనల్ కమిషనర్ల బదిలీలను మొదలుపెట్టిన ప్రభుత్వం డిప్యూటీ కమిషనర్లకు కూడా స్థానచలనం కల్పించేందుకు ఆదేశాలు ఇచ్చింది. జడ్సీలతో మొదలుపెట్టి.. : బల్దియాలో జోనల్ కమిషనర్ల (జడ్సీ) వ్యవస్థ చాలా కీలకమైంది. అందుకే ఆ విభాగం నుంచే ప్రక్షాళనను మొదలుపెట్టారు. శనివారం కూకట్‌పల్లి జడ్సీ మమతను నేషనల్ ఇన్‌స్టిట్యూట్ అర్బన్ మేనేజ్‌మెంట్ విభాగానికి బదిలీ చేశారు. డీసీగా, జోనల్ కమిషనర్‌గా ఆమె పదేళ్లుగా నగరంలోనే పని



చేస్తున్నారు. శేరిలింగంపల్లి జడ్సీ శ్రీనివాసరెడ్డి వేరే విభాగం నుంచి వచ్చి పదేళ్లుగా ఇక్కడే ఉన్నారు. వీరిద్దరిని బదిలీ చేయడం ద్వారా ప్రక్రియ మొదలైంది. ఏళ్లుగా ఒకేచోట తిష్ఠ వేసి.. పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న డీసీలు, ఇతర అధికారులను బదిలీ చేసే అవకాశం ఉందని ఉన్నతాధికారులు తెలిపారు.

అన్ని విభాగాల్లోనూ.. : ప్రణాళికా విభాగంలో భారీగా అక్రమాలు చోటుచేసుకుంటున్నాయన్నది బహిరంగ రహస్యమే. ఏళ్లుగా ఈ విభాగంలో ప్రక్షాళన జరగకపోవడంతో.. ప్రభుత్వం దృష్టిసారించింది. హెచ్ఎండీఏలో తహసీల్దార్లతోపాటు చాలామంది పదవీ విరమణ చేసిన ఉద్యోగులు ఏళ్లుగా పని చేస్తున్నారు. వీరిందరినీ తొలగించే అవకాశం ఉందని సమాచారం. జలమండలిలోనూ బదిలీల పర్వం మొదలుకానుంది. జలమండలి అటవీ విభాగంలో ఉన్న విశ్రాంత అధికారులను పంపించే అవకాశం ఉంది. మరోవైపు మూడు పోలీసు కమిషనరేట్లలోనూ త్వరలో మరికొన్ని బదిలీలు జరగనున్నాయి.

# అడ్డగోలుగా దోచేస్తుంటే.. జరిమానాల జపమేల?

హైదరాబాద్ ఐదేళ్లవుతున్నా.. నగరంలో ఉచిత పార్కింగ్ విధానం పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. అక్రమ పార్కింగ్ వసూళ్లు అంతకంతకు పెరుగుతున్నాయి. జీహెచ్ఎంసీ నిర్లక్ష్యంతో.. వినియోగదారులు బహిరంగ దోపిడీకి గురవుతున్నారనే విమర్శలొస్తున్నాయి. అక్రమ పార్కింగ్ రుసుము రూపంలో.. రోజూ గ్రేటర్ పరిధిలో రూ.కోటికిపైగా దందా జరుగుతుందంటే.. బల్దియా పనితీరు ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. కేవలం ఫిర్యాదులను స్వీకరించడం, నిర్వాహకులకు రూ.10వేల నుంచి రూ.50వేల జరిమానా విధించడం వరకే తమ బాధ్యత అన్నట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారు. దాంతో.. రోజూ రూ.1లక్ష, అంతకుపైగా వసూలు చేస్తోన్న అక్రమ పార్కింగ్ కేంద్రాలు రెచ్చిపోతున్నాయి. ఎన్ని జరిమానాలు వేసినా.. వసూళ్లను ఆపేది లేదంటూ దందాను కొనసాగిస్తున్నాయి..

జరిమానాలు వేసినా బేఖాతరు..

సికింద్రాబాద్ సీటీసీ కాంప్లెక్సులో అక్రమ పార్కింగ్ రుసుము వసూలు ఏళ్ల తరబడి కొనసాగుతోంది. ఎలక్ట్రానిక్స్ కేంద్రమైన ఇక్కడికి రోజూ పది వేల మందికిపైగా వినియోగదారులు వస్తుంటారు. అందులో 60-70శాతం మంది ద్విచక్ర వాహనదారులుంటారు. అందులో 90శాతం మంది పార్కింగ్ రుసుము చెల్లిస్తుంటారు. కార్ల నుంచి కూడా రుసుము వసూలు చేస్తుంటారు. ఆ ఒక్క కాంప్లెక్సు ద్వారా.. రోజూ రూ. 1.5లక్షల మేర ఆదాయం వస్తుంటుంది.

అమీర్‌పేట మైత్రివనం ఎదురుగా ఉన్న ఆదిత్య వాణిజ్య సముదాయం,




బేగంపేట మైహోం టైకూన్ భవనంలోని షాపింగ్ మాల్, బంజారాహిల్స్‌లోని జీవీకే వన్ మాల్, ట్రూప్ బజార్ 70ఎంఎం, మియాపూర్‌లోని మిరాజ్, శాలినీ, ఆర్టీసీ క్రాసురోడ్డులోని అన్ని థియేటర్లు, పలు హోటళ్లు యథేచ్ఛగా పార్కింగ్ రుసుమును వసూలు చేస్తున్నాయి. ఇలాంటివి నగరంలో వందలాదిగా ఉన్నాయి.

ఏప్రిల్ 1, 2018 నుంచి షాపింగ్ మాల్స్, వాణిజ్య భవనాలు, వినియోగదారులకు సేవలందించే ఇతర వ్యాపార సముదాయాల్లో వాహనాలకు ఉచిత పార్కింగ్ సేవలందించాలనే విధానం తెచ్చినా అమలుకు నోచుకోవడం లేదు.చాలావాటికి జీహెచ్ఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు జరిమానాలు విధిస్తున్నా బేఖాతరు చేస్తూ.. వ్యాపారం చేస్తున్నారు. ఉదాహరణకు..సీటీసీ కాంప్లెక్సుకు జీహెచ్ఎంసీ గతంలో పలు జరిమానాలు విధించింది. మైహోంటైకూన్, అమీర్‌పేట ఆదిత్య భవనం, జీవీకే వన్, ఇతరత్రా సముదాయాల్లోని పార్కింగ్ కేంద్రాలు పట్టించుకోవడం లేదు.

# ఫాలోవర్ల మోజు.. తెస్తోంది చేటు



హైదరాబాద్ : రహస్యంగా ఉంచాల్సిన వ్యక్తిగత చిత్రాలు సామాజిక మాధ్యమాల్లో పెట్టేయడం నేరగాళ్లకు వరంగా మారుతోంది. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ ఇతర మాధ్యమాల్లో యువతుల ఖాతాలకు ప్రొఫైల్ లాక్ ఉంచకపోవడంతో ఎంతోమంది వేధింపుల బారినపడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇటీవల 'ఫాలోవర్ల' రూపంలో కొందరు స్నేహితుల్లా నటిస్తూ వ్యక్తిగత చిత్రాలు సేకరించడం, తర్వాత వాటిని మార్ఫింగ్ చేసి బెదిరింపులకు దిగడం పెరుగుతోంది. నగర సైబర్‌క్రైమ్ పోలీసుల అధ్యయనం ప్రకారం.. బాధితుల్లో బాలికలు, యువతులు ఎక్కువగా ఉంటున్నట్లు వెల్లడైంది.

'రక్షణ' ఉండని వారే లక్ష్యం

ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లో ఫాలోవర్లు, లైకుల సంఖ్య పెంచుకోవాలనే ఉద్దేశంతో కొందరు యువతులు ప్రొఫైల్ లాక్ ఆప్షన్ వినియోగించడం లేదు. సాధారణంగా ఈ ఆప్షన్ ఉంటే స్నేహితుల జాబితాలో లేని వ్యక్తులు, అపరిచితులు ఖాతా వివరాలు, పోస్టు చేసిన ఫొటోలు, వీడియోల్ని వీక్షించే అవకాశం ఉండదు. ఆప్షన్ లేకపోతే మాత్రం ఎవరైనా వాటిని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ చిన్న పొరపాటును ఆసరా చేసుకుని నేరగాళ్లు మహిళలు, యువతులపై వికృత చేష్టలకు దిగుతున్నారు. ఫొటోలు సేకరించి వాటిని అసభ్యంగా మార్ఫింగ్ చేయడం, డీప్‌ఫేక్‌గా మార్చి అశ్లీల వెబ్‌సైట్లలో అప్‌లోడ్ చేస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నారు. ఇంకొందరు లైంగికంగా వేధిస్తూ నరకం చూపిస్తున్నారు.

స్నేహం ముసుగుతో వేధింపులు

పరిచయం లేకపోయినా తోటి అమ్మాయిలనే ఉద్దేశంతో సామాజిక మాధ్యమాల్లో స్నేహితులుగా చేర్చుకోవడం సమస్యగా మారుతోందని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. యువతీ, యువకులు సామాజిక మాధ్యమాల్లో ఎక్కువ మంది ఫాలోవర్లు ఉండాలని ఆశిస్తారు. పరిచయంలేని వారిని సైతం స్నేహితులుగా చేర్చుకుంటారు. ఇలాంటి వారిలో ఎక్కువ మంది తొలుత స్నేహంగా నటించి తర్వాత వేధింపులకు పాల్పడుతుంటారు. ఇందులో కొన్నిసార్లు స్నేహితుల పాత్ర ఉండటం కలవరపెడుతోంది. గతంలో రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఓ కళాశాల యువతుల్ని వేధిస్తున్న ఇద్దర్ని అరెస్టు చేశారు. నిందితులకు సహకరించింది బాధితుల స్నేహితురాలే కావడం గమనార్హం.

హైదరాబాద్‌కు చెందిన 14 ఏళ్ల బాలిక ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ యువతి నుంచి వచ్చిన ఫ్రెండ్ రిక్వెస్ట్‌ను అంగీకరించింది. కొన్నాళ్లు అమ్మాయిలా ప్రవరిస్తూ స్నేహం చేసిన అవతలి వ్యక్తి.. బాలిక వ్యక్తిగత చిత్రాలు సేకరించాడు. అనంతరం నగ్నఫొటోలు/ వీడియోలు పంపాలని బెదిరించాడు. లేకపోతే అప్పటికే తన దగ్గరున్న చిత్రాల్ని మార్ఫింగ్ చేస్తానని వేధించాడు. పోలీసులు దర్యాప్తు చేయగా అమ్మాయిగా నటించింది పురుషుడని తేలింది.

ఇన్‌స్టాగ్రామ్‌లో మహిళలు, యువతులు పోస్టు చేసిన వ్యక్తిగత ఫొటోల్ని డీప్‌ఫేక్ విధానంలో నగ్నంగా మార్చి డబ్బు డిమాండ్ చేస్తున్న నిందితుడిని హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ప్రొఫైల్ లాక్ పెట్టుకోని యువతుల చిత్రాలు సేకరించి డీప్ ఫేక్‌గా మారుస్తున్నట్లు దర్యాప్తులో తేలింది.

ప్రైవేటు సెట్టింగ్స్ ఉపయోగించాలి

"సామాజిక మాధ్యమాలు ఉపయోగించేటప్పుడు ప్రతి ఒక్కరూ కచ్చితంగా ప్రైవేటు సెట్టింగ్స్ ఉపయోగించాలి. తెలియని వ్యక్తులు స్నేహితులుగా మారినా.. ఏదైనా సమాచారం అడిగినా ఎట్టిపరిస్థితుల్లో స్పందించకూడదు. ఆన్‌లైన్‌లో అమ్మాయిల తరహాలో కొందరు నకిలీ ఖాతాలు తెరిచి స్నేహితులుగా మారతారు. పరిచయం పెరిగాక ఫొటోలు, వీడియోలు సేకరించి బ్లాక్ మెయిల్ చేస్తుంటారు. అపరిచిత వ్యక్తుల్ని స్నేహితులుగా చేర్చుకోకపోవడం ఇంకా ఉత్తమం. ముఖ్యంగా ఫొటోలు, వీడియోలు ఎవరితోనూ పంచుకోకూడదు"రూపేశ్ మిట్టల్, సైబర్ జాగృతి, సేఫ్టీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు

# హైదరాబాద్ ఫార్ములా రేస్ రద్దుకు అసలు కారణం ఇదేనా?



ఈ ఏడాది ఫిబ్రవరి 10న హైదరాబాద్ లో జరగాల్సిన ఫార్ములా ఈ-రేస్ రద్దు అయ్యింది. ఈ మేరకు ఫార్ములా ఈ- రేసును రద్దు చేసినట్లు ఎఫ్ఐఏ ప్రకటించింది. తెలంగాణ ప్రభుత్వం స్పందించకపోవడంతోనే రేసును రద్దు చేస్తున్నట్లు వెల్లడించింది. తెలంగాణ ప్రభుత్వ నియంత్రణలో ఉన్న పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ.. ఆతిథ్య నగరం (హోస్ట్ సిటీ) ఒప్పందాన్ని నెరవేర్చకూడదని నిర్ణయం తీసుకుందని.. ఈ నేపథ్యంలో రేసును నిర్వహించబోమని నిర్వాహక సంస్థ.. ఎఫ్ఐఏ ప్రకటించింది. కాగా దేశంలోనే తొలిసారిగా గతేడాది ఫిబ్రవరిలో హైదరాబాద్ వేదికగా ఫార్ములా ఈ- రేసింగ్ ఛాంపియన్‌షిప్ జరిగిన సంగతి తెలిసిందే. ప్రపంచం దృష్టిని ఆకర్షించేలాం హుస్సేన్ సాగర్ తీరం వెంబడి ఈ రేసును నిర్వహించారు. మన దేశంలో తొలిసారిగా జరిగిన ఈ ఇంటర్నేషనల్ ఫార్ములా ఛాంపియన్‌షిప్‌ను చూసేందుకు పలువురు క్రీడా, సినీ, వ్యాపార ప్రముఖులు హైదరాబాద్ నగరానికి భారీ ఎత్తున తరలివచ్చారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో కూడా హైదరాబాద్ ఫార్ములా ఈ- రేసింగ్ కు ఆతిథ్యం ఇవ్వనుందని రేసింగ్ ప్రియులు ఆశించారు. అయితే తెలంగాణలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడం, దీనిపై ఇంకా నిర్ణయం తీసుకోకపోవడంతో ఫార్ములా ఈ-రేసింగును రద్దు చేస్తున్నట్టు నిర్వాహకులు ప్రకటించారు. రేసింగ్ నిర్వహణకు నిర్వాహకులు గతేడాది అక్టోబర్ 30న ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నారు. తెలంగాణ కొత్త ప్రభుత్వం నుంచి వచ్చిన తాజా అధికారిక సమాచారం ప్రకారం.. రేసింగు నిర్వాహకులు ఈ నెల ప్రారంభంలో తెలంగాణ ప్రభుత్వ అధికారులతో సమావేశమయ్యారు. అప్పటి నుంచి ఇంకా చర్చలు కొనసాగుతూనే వున్నాయి. ఫిబ్రవరిలో నిర్వహించనున్న ఈ భారీ ఈవెంట్ కు కొద్దిరోజుల సమయం మాత్రమే ఉంది. అయితే ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి అప్‌డేట్ రాలేదు. దీంతో రేసు రద్దు నిర్ణయం తీసుకున్నారు. వచ్చే ఏడాది రేసును టోక్యో, షాంఘై, బెర్లిన్, లండన్ లతో సహా ఇతర ప్రముఖ నగరాల్లో నిర్వహిస్తారని సమాచారం. హైదరాబాద్ లో ఫార్ములా ఈ రేస్ రద్దు పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది నిజంగా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న దుర్మార్గమైన, తిరోగమన నిర్ణయమే అని ధ్వజమెత్తారు. హైదరాబాద్ ఈ-ప్రిక్స్ వంటి ఈవెంట్‌లు ప్రపంచవ్యాప్తంగా హైదరాబాద్ నగరం బ్రాండ్ ఇమేజ్‌ను పెంచుతాయన్నారు. ఫిబ్రవరిలో జరగాల్సిన ఈ రేసింగ్ పై తెలంగాణ ప్రజలు చాలా ఆసక్తిగా ఎదురు చూస్తున్న సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయడం సరైంది కాదన్నారు.

# అందుకే ఫార్ములా.. పనిచేయలేదు

హైదరాబాద్: ఫార్ములా ఈ-రేస్ నిర్వహణపై ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఇందుకు ట్రాఫిక్ ఇబ్బందులే ప్రధాన కారణమని తెలుస్తోంది. ఈ రేస్‌తో నగరానికి అంతర్జాతీయ గుర్తింపు వచ్చినప్పటికీ స్ట్రీట్ ట్రాక్ కోసం ఎంచుకున్న ప్రదేశం సరైనది కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గత సీజన్‌లో ఫిబ్రవరి 10, 11 తేదీల్లో జరిగిన పోటీల ఏర్పాట్ల పేరుతో 10 రోజుల నుంచి హుస్సేన్‌సాగర్ చుట్టూ ట్రాఫిక్ నిలిపివేశారు. దీంతో అటు సికింద్రాబాద్, ఇటు నాంపల్లి, మెహిదీపట్నం, అమీర్‌పేట, ఖైరతాబాద్ ఇలా అన్ని వైపులా ట్రాఫిక్ గంటల తరబడి నిలిచిపోయింది. పాఠశాలలు, కార్యాలయాలకు వెళ్లే సమయాల్లో వాహనదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటి స్ట్రీట్ ట్రాక్‌లను ట్రాఫిక్ రద్దీ లేని ప్రాంతాల్లో ఎంపిక చేస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవని తొలి నుంచి సూచించినప్పటికీ... పర్యాటకంగా హుస్సేన్‌సాగర్ కీలకంగా ఉండటం... నగరం నడిబొడ్డున కావడంతో హెచ్ఎండీఏ అధికారులు ఈ ప్రాంతాన్ని ఎంచుకున్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ గార్డెన్‌లో భారీ, అరుదైన వృక్షాలను ట్రాన్స్‌లోకేట్ చేశారు.

ట్రాక్ ఎంపికతో అసలు సమస్య..

సదుపాయాల పరంగా హైదరాబాద్ ముందుండటంతో గత సీజన్‌లో నగరాన్ని ఎంపిక చేశారు. ఆ బాధ్యతను హెచ్ఎండీఏకు అప్పగించారు. ట్రాక్ నగరం మధ్యలో ఉండేలా ఐదారు ప్రాంతాలను పరిశీలించినప్పటికీ చివరికి హుస్సేన్‌సాగర్ వైపు మొగ్గు చూపారు. ఫార్ములా-ఇ రేస్ కోసం 2022 సెప్టెంబరు, డిసెంబరులో ఇదే ట్రాక్‌పై ఇండియన్ రేస్ లీగ్, జాతీయ రేసింగ్ పోటీలు నిర్వహించారు. తర్వాత



2023 ఫిబ్రవరి 10 అంతర్జాతీయ 9వ సీజన్‌ను నిర్వహించారు. పదో సీజన్ కింద ఈ ఏడాది ఫిబ్రవరి 10న ఇదే ట్రాక్‌పై నిర్వహించాల్సి ఉండగా అర్ధాంతరంగా ఆగిపోయింది. ప్రస్తుతం సీఎం ఇతర మంత్రులు నిత్యం సచివాలయానికి రాకపోకలు సాగిస్తుండటంతో తీవ్రమైన ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతోంది. ఈ తరుణంలో మరోసారి ఇదే ట్రాక్‌పై పోటీలు జరిగితే ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందనే ఉద్దేశంతో ప్రభుత్వం వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. ప్రైవేటు ఈవెంట్ కోసం ప్రభుత్వ సంస్థ అయిన హెచ్ఎండీఏ సొంత నిధులతో మౌలిక వసతులు కల్పించడం అప్పట్లో వివాదంగా మారింది.

# రవాణా సదుపాయం మెరుగయ్యేదెన్నడో?

జగిత్యాల : గ్రామీణ ప్రాంతాల ప్రజలకు, వాహనదారులకు మెరుగైన రవాణా సదుపాయం కల్పించేందుకు పీఎంజీఎస్‌వై పథకంలో మల్లాపూర్ నుంచి జగ్గారావుపల్లి వరకు తారు రహదారి నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయి. మల్లాపూర్ నుంచి కొత్తపేట వరకు పనులు పూర్తవగా వెంకట్రావుపల్లి నుంచి జగ్గారావుపల్లి వరకు పనులు చేపట్టాల్సి ఉంది. వెంకట్రావుపల్లి ఒర్రె ప్రాంతంలో వంతెన నిర్మాణానికి రూ.2.97 కోట్లు మంజూరైనప్పటికీ టెండర్ ప్రక్రియ పూర్తి కాలేదు.

నత్తనడకన పనులు

మల్లాపూర్ నుంచి వెంకట్రావుపల్లి మీదుగా జగ్గారావుపల్లి వరకు సుమారు 7.15 కిలోమీటర్ల రహదారి ఉంది. వెంకట్రావుపల్లి నుంచి జగ్గారావుపల్లి వరకు మట్టి రహదారి కావడంతో ఏటా వర్షాకాలంలో వాహనదారులు, వ్యవసాయ పొలాలకు వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయం కల్పించేందుకు పీఎంజీఎస్‌వై పథకంలో తారు రహదారి నిర్మాణం చేపట్టేందుకు అధికారులు ప్రతిపాదనలు పంపించడంతో రూ.4.14 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. మల్లాపూర్ అనుబంధ గ్రామం రేగులపల్లెకు వెళ్లే దారిలోని సమీపంలో ఉన్న లో లెవల్ కల్వర్టు వద్ద వంతెన నిర్మాణం చేపట్టారు. మల్లాపూర్ వద్ద 95 మీటర్లు, కొత్తపేటలో 350 మీటర్లు సీసీ రహదారి నిర్మించారు. మిగిలిన చోట మల్లాపూర్ నుంచి కొత్తపేట వరకు తారు రహదారి వేశారు. వెంకట్రావుపల్లి నుంచి జగ్గారావుపల్లి వరకు తారు రహదారి వేయడంలో భాగంగా కల్వర్టుల నిర్మాణం చేపడుతున్నారు. పనులు నత్తనడకన సాగుతుండటంతో వాహనదారులు, వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లే రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. చేసిన పనులకు బిల్లులు సకాలంలో రాకపోవడంతో జాప్యం జరుగుతున్నట్లు సమాచారం.

నిధులు మంజూరైనా..

వెంకట్రావుపల్లి నుంచి జగ్గారావుపల్లి వెళ్లే దారిలో ఉప కాలువ సమీపంలోని ఒర్రె ప్రాంతంలో వంతెన లేకపోవడం వల్ల వ్యవసాయ పొలాలకు వెళ్లే రైతులు, జగ్గారావుపల్లి, విలాసాగర్ వెళ్లే వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. కొదురుపాక, నర్సింగాపూర్ మీదుగా జగ్గారావుపల్లి, విలాసాగర్ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. వంతెన నిర్మాణానికి రూ.2.97 కోట్లు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియ పూర్తి కాకపోవడంతో పనులు ప్రారంభం కావడం లేదు. తారు రహదారి, వంతెన నిర్మాణం పూర్తయితేనే రవాణా సదుపాయం మెరుగై ఇబ్బందులు తొలగుతాయి. ఈ మేరకు ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకొని త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

అసంపూర్తి పనులతో ఇబ్బందులు

తారు రహదారి సకాలంలో పూర్తి చేయకపోవడంతో వెంకట్రావుపల్లి నుంచి జగ్గారావుపల్లి, విలాసాగర్ వెళ్లేందుకు వాహనదారులతో పాటు వ్యవసాయ పొలాలకు వెళ్లే రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒర్రె ప్రాంతంలో వంతెన నిర్మాణ పనులు త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేయాలి.

నందయ్య, సర్పంచి, వెంకట్రావుపల్లి

త్వరలోనే టెండర్ ప్రక్రియ

వెంకట్రావుపల్లి ఉప కాలువ సమీపంలో వంతెన నిర్మాణానికి రూ.2.97 కోట్లు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియను త్వరలోనే నిర్వహిస్తారు. వెంకట్రావుపల్లి నుంచి జగ్గారావుపల్లి వరకు కల్వర్టుల నిర్మాణం చేపట్టడం పూర్తికావచ్చింది. త్వరలోనే తారు వేయించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. విష్ణువర్ధన్, ఏఈ పీఆర్

# పాండవుల గుట్టలో మట్టి దందా

జగిత్యాల : అక్రమార్జనే ధ్యేయంగా కొందరు యంత్రాలతో ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు. ప్రజాప్రతినిధుల అండతో అనుమతులు లేకుండానే గుట్టలను కరిగిస్తున్నారు. కాల్వశ్రీరాంపూర్ మండలకేంద్రంలోని సర్వే నంబరు 597లోని ప్రభుత్వ స్థలంలో సుమారు 200 ఎకరాల విస్తీర్ణంలో పాండవుల గుట్ట ఉంది. కొద్ది రోజులుగా గుట్ట నుంచి మొరాన్ని తవ్వుతున్నారు. మూడు పొక్లెయిన్‌లు, ఆరు టిప్పర్లుగా దందా యథేచ్ఛగా సాగుతోంది. గతంలో రాత్రి పూట దందా చేసే వ్యాపారులు పగటి పూటనే విచ్చలవిడిగా తరలిస్తున్నారు. రహదారులు, ఇళ్ల నిర్మాణాలు, కొత్త వెంచర్ల ఏర్పాటు, మట్టి పనులు చేసేందుకు మొరం అవసరం. ఒక్కో టిప్పరుకు రూ.2500 పలుకుతోంది. అయితే పాండవుల గుట్ట నుంచి ప్రభుత్వానికి పైసా చెల్లించకుండానే తరలిస్తూ ఆదాయానికి గండి కొడుతున్నారు. రెవెన్యూ, గనుల శాఖల మధ్య సమన్వయ లోపంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. పర్యవేక్షణ బాధ్యత మాది కాదంటే మాది కాదంటూ రెండు శాఖల అధికారులు తప్పించుకుంటున్నారు.

దర్జాగా పంటల సాగుమరోవైపు గుత్తేదార్లు గుట్ట నుంచి మట్టిని తవ్వి తరలిస్తుండగా ఖాళీ అయిన స్థలాన్ని కొందరు ఆక్రమించి చదును



చేసి సాగు చేస్తున్నారు. గతంలో 597 సర్వే నంబరులోని ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు కొంత మందికి పట్టాలు చేసినట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

ఇవీ నిబంధనలు

ప్రభుత్వ అభివృద్ధి పనులకు, లేదా ప్రైవేటు పనులకు మట్టి అవసరమైతే సంబంధిత గుత్తేదారు స్థానిక అధికారుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలి. ఇందుకోసం నిర్ణీత రుసుం చెల్లించాల్సి ఉంటుంది.

ఏ పని కోసం మట్టి అవసరముంది? రోజుకు ఎంత మొత్తం తరలిస్తారు? తదితర విషయాలను దరఖాస్తు పత్రంలో స్పష్టంగా పొందుపరచాలి.మట్టిని తరలించడానికి ఉపయోగించే వాహనాల వివరాలు, వాటి రిజిస్ట్రేషన్ నంబర్లను అధికారులకు సమర్పించాలి. అనుమతి పొందినా నిబంధనల మేరకే మట్టిని తరలించాల్సి ఉంటుంది.మట్టిని ఎంత మేర తవ్వుతున్నారనే విషయాన్ని సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి.

అక్రమార్కులపై చర్యలు తీసుకుంటాం

ప్రభుత్వ భూమి నుంచి మట్టి తరలించే గుత్తేదార్లు నిబంధనల ప్రకారం నడుచుకోవాల్సి ఉంటుంది. అనుమతి లేకుండా మొరం తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. అలాగే ప్రభుత్వ భూమిని ఆక్రమించి సాగు చేయడంపై పరిశీలిస్తాం. హద్దులు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తాం. జాహేద్‌పాషా, కాల్వశ్రీరాంపూర్ తహసీల్దార్

# దృష్టి సారిస్తేనే పూర్వవైభవం

చేగుంట: ప్రజలకు ఆహ్లాదాన్ని పంచిన వల్లూరు నర్సరీ నిర్వహణ కొరవడి అధ్వానంగా మారింది. గతంలో నిత్యం పర్యాటకులతో కళకళలాడిన ఆ ప్రాంతం నేడు వెలవెలబోతోంది. 17 ఏళ్ల కిందట 44వ జాతీయ రహదారి పక్కనే దీనిని ఏర్పాటు చేశారు. అప్పట్లోనే రూ.6 కోట్లు వెచ్చించి అభివృద్ధి చేశారు. ఇందులో మొక్కల పెంపకం చేపట్టడంతో అవి ఏపుగా పెరిగి ప్రశాంత వాతవరణం నెలకొంది. ఆ దారిలో ప్రయాణించేవారు కొద్దిసేపు సేదదీరి వెళ్లేవారు. చెక్‌డ్యాంలు, చిన్న నీటికొలను నిర్మించారు. అలాగే వివిధ రకాల జంతువులు, పక్షుల పెంపకం చేపట్టారు. 35 రకాల ఔషధ మొక్కలు ఉండేవి. మెదక్, ఆదిలాబాద్, కామారెడ్డి, నిజామాబాద్, హైదరాబాద్ నుంచి



విద్యార్థులు సందర్శించేవారు. రానురాను అటవీ అధికారులు పట్టించుకోలేదు. ప్రస్తుతం చెట్లు తప్ప, మిగతావి ఏమీ కనిపించడం లేదు. పూర్వవైభవం తీసుకుని వస్తామని అధికారులు చెబుతున్నా పరిస్థితిలో మార్పు లేదు. మెదక్, కామారెడ్డి, నిజామాబాద్, అదిలాబాద్ కరీంనగర్, సిరిసిల్ల సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాలతో పాటు దూలపల్లి అటవీ అకాడమీకి చెందిన ఐఎఫ్ఎస్ అధికారులు, శిక్షణలో ఉండే ఎఫ్ఆర్‌వోలు, బీట్ అధికారులు వీఎస్ఎస్ సిబ్బందికి దీనిని శిక్షణ కేంద్రంగా ఉపయోగించారు. ఇపుడా పరిస్థితి లేదు. ఇక్కడ వసతుల కల్పనకు నిధులు మంజూరు చేసి పక్కా కార్యాచరణతో అడుగేస్తేనే పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దే అవకాశం ఉంది.

**ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం**

నర్సరీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. నిధులు ఇవ్వాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. మొక్కల పెంపకంపైనే దృష్టి కేంద్రీకరించాం. పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తాం.
విద్యాసాగర్, ఎఫ్ఆర్‌వో, రామాయంపేట

# విద్యాదీప్తి... నైపుణ్యప్రాప్తి

చేగుంట:కరోనా సమయంలో మొదలైన శిబిరంతో ప్రయోజనాలు ఉండటంతో ఆ తర్వాతి ఏడాది 8 చోట్ల ఏర్పాటుచేశారు. దీన్ని స్ఫూర్తిగా తీసుకొని జిల్లాలోని మరికొన్ని గ్రామాల్లో ఈ ప్రక్రియ షురూ చేశారు. ఇలా ఈ సారి 48 పఠన శిబిరాలు కొలువుదీరడం గమనార్హం. వీటికితోడు ఎన్జీవోల సహకారంతో మరో 62 చోట్ల వీటిని ఏర్పాటుచేసి కొనసాగిస్తున్నారు. వీటిల్లో బోధించే వాలంటీర్లకు ఎలాంటి వేతనం ఇవ్వరు. స్వచ్ఛందంగా పాఠాలు బోధించాల్సి ఉంటుంది. అప్పాయిపల్లి గ్రామంలోని ఓ శిబిరంలో సర్పంచి గీతా ఠాగూర్ స్వయంగా పాఠాలు బోధిస్తున్నారు. మరికొన్ని చోట్ల ఉపాధ్యాయులు, యువకులు ముందుకొచ్చి తరగతులు చెబుతున్నారు.

**ఆయా అంశాలపై..**వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయం వృథా చేసుకోకుండా ఉండేందుకు వీటి ఏర్పాటుకు గ్రామస్థులు మొగ్గు చూపుతున్నారు. నిత్యం ఉదయం 6 నుంచి 10 గంటల వరకు శిబిరాన్ని కొనసాగిస్తారు. ఉపాధ్యాయులు ఆయా అంశాల్లో పాఠాలు బోధిస్తారు. రాయడంలోనూ తీర్చిదిద్దుతారు. విద్యతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తారు. గుణింతాలు, ఆంగ్లంలో మాట్లాడటం, ఎవరితో ఎలా మాట్లాడాలి, ఇతరులను గౌరవించడం ఎలా, నైతిక విలువలు, ఆరోగ్యంగా ఉండేందుకు చిట్కాలు, ధ్యానం, యోగా, సంగీతం, నృత్యం, ఆటలు, పాటలు, చిత్రలేఖనం, ఆధ్యాత్మికత, దేశభక్తి, వివిధ కళలపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఆయా రంగాల్లో అనుభవజ్ఞులైన వారిని పాఠశాలకు పిలిచి విద్యార్థులకు అర్థమయ్యేలా వివరిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో వికారాబాద్, మంతన్‌గౌడ్, మర్పల్లి, నస్కల్, నాగిరెడ్డిపల్లి, ఉడిమేశ్వరం, చిన్ననందిగామ, బుల్కాపూర్ తదితర చోట్ల కొనసాగుతున్నాయి.

**చదువుకు దూరం కాకుండా..**ప్రజా సేవ కంటే విద్యార్థులకు బోధించడం ఎంతో సంతోషాన్నిస్తోంది. తనతో పాటు మరో 8 మంది స్వచ్ఛందంగా ముందుకొచ్చి తరగతులు చెబుతున్నారు. వేసవిలో పిల్లలు చదువుకు దూరం కాకుండా ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతోంది.
గీతాఠాగూర్, సర్పంచి, అప్పాయిపల్లి

**బొమ్మలు గీయడం వచ్చింది..**

బొమ్మలు ఎలా గీయాలి.. రంగులెలా వేయాలో నేర్చుకున్నా. ఆంగ్లంలో మాట్లాడే పదాలను తెలుసుకున్నా. వీటితో పాటు అన్ని ఆటలు ఆడే విధానం, మెలకువలు తెలుసుకున్నా. ఆట పాటలతో చదువుకోవడం సెలవుల్లో సరదా అనిపిస్తోంది.
కార్తీక్ రాథోడ్, విద్యార్థి

**గుణింతాలు నేర్చుకున్నా**

గణితంలో మెలకువలు నేర్చుకున్నాను. వేసవి శిబిరంలో 6 నుంచి 20 వరకు గుణింతాలు నేర్చుకోగలిగా. చిత్రాలు గీయడం, దేశభక్తి గీతాల ఆలాపన, మహనీయుల జీవిత చరిత్రలు చదివాను. ఆట పాటలతో చదువుకుంటూ సెలవులను సరదాగా గడుపుతున్నా.
హారిక, విద్యార్థిని

**ఇతర రాష్ట్రాల్లో సైతం..**

వికారాబాద్ జిల్లాలో కొనసాగుతున్న పఠన శిబిరాల గురించి తెలియడంతో దిల్లీకి చెందిన ఓ బృందం అప్పాయిపల్లికి వచ్చారు. విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి చూసి ఎంతో సంతోషించారు. వేసవి పఠన శిబిరాలు సత్ఫలితాలు అందిస్తున్నాయని గ్రహించారు. పిల్లలను అన్ని రకాలుగా పరీక్షించారు. ప్రతిభ చూపగా ప్రశంసించారు. ఇలాంటి ప్రయోగాన్ని ఇతర జిల్లాలు, రాష్ట్రాల్లో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**రెండు నెలల పాటు..**వేసవి శిబిరానికి చిన్నారులు ఆసక్తిగా వస్తున్నారు. చదువుతో పాటు ఆటలు, నృత్యాలు, కర్రసాము వంటి విద్యార్థులకు తెలియని ఆటలు, వ్యక్తిగత రక్షణకు ఉపయుక్తమైన వాటిని వివరిస్తున్నాం. నేర్పించిన వాటిపై విద్యార్థులు నైపుణ్యం ప్రదర్శించారు. దిల్లీ బృందం సభ్యులు సైతం ప్రశంసించింది. వీరేశం, ఉపాధ్యాయుడు

# అందరూ చదవాలి.. అతివలూ ఎదగాలి..



ఖమ్మం : లింగ భేదం లేకుండా మహిళలు సాంకేతిక ఫలాలు అందుకోవాలని, డిజిటల్ అక్షరాస్యత సాధించాలని ఐక్యరాజ్య సమితి 2023 సంవత్సరానికి 'డిజిట్ ఆల్' అనే నినాదాన్ని ప్రకటించింది. ఆర్థిక, విద్య, వైద్య, సామాజిక రంగాలతో పాటు ఆవిష్కరణలు, సాంకేతిక రంగాల్లోనూ స్త్రీ, పురుష సమానత్వాన్ని చాటాలని (ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ఫర్ ఈక్వాలిటీ) పిలుపునిచ్చింది. కూరగాయలు కొనటం దగ్గర నుంచి బ్యాంకింగ్ వరకూ అన్నీ డిజిటల్ రూపంలోకి మారిపోయాయి. చదువు, సాంకేతిక పరిజ్ఞానంతో ఉద్యోగాలు చేస్తున్న మహిళల శాతం 52.8 శాతానికి పెరిగిందని ఇండియా స్కిల్స్ రిపోర్టు అధ్యయనంలో తేలింది. కొవిడ్ కాలంలో ఇంటి పని, వంట పనితో పాటు మహిళల్లో స్మార్ట్‌ఫోన్ల వినియోగం పెరిగింది. అంతర్జాలంలో ఆరోగ్య జాగ్రత్తలు, పోషకాహారం వంటివి శోధించి పాటించారు. పిల్లలు చదువుకు దూరం కాకుండా ఆన్‌లైన్‌లో క్లాసులు వినిపించారు. మూడేళ్లలో టెక్నాలజీ పరంగా కొత్త విషయాలు తెలుసుకున్నారు. యోగా, నృత్యం, కవిత్వం వంటి అభిరుచులతో పాటు టైలరింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్ కోర్సులను సైతం ఆన్‌లైన్‌లో నేర్చుకుని ఉపాధి అవకాశాలను మెరుగుపరచుకుంటున్నారు. వాట్సాప్‌లో ఆన్‌లైన్ వ్యాపారం, యూట్యూబ్‌లో వంటల వీడియోలు చేస్తూ ఆదాయ మార్గాలను సృష్టించుకున్నారు. ఐటీ రంగంలో 34 శాతం, స్టార్టప్ ఇన్నోవేషన్ రంగంలో 17 శాతం మహిళలు ఉన్నారని నాస్కామ్ అధ్యయనం వెలిబుచ్చింది. ఆడపిల్లల్లో పాఠశాల స్థాయి నుంచే డిజిటల్ విద్య పెరిగినప్పుడే సాంకేతిక, ఆవిష్కరణ రంగాల్లోనూ సమతుల్యత సాధ్యమవుతుందని విశ్లేషకులు చెబుతున్నారు.

ఆన్‌లైన్‌లో కోచింగ్ తీసుకుని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉద్యోగం దక్కించుకున్నా. అంతకుముందు అంగన్‌వాడీ టీచరుగా విధులు నిర్వర్తించాను. కొవిడ్ కాలంలో లబ్ధిదారులకు సూచనలు, సలహాలను మొబైల్ ద్వారా పంపించాను. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, తల్లుల హాజరు, పౌష్టికాహరం, ఆరోగ్య పరీక్షలు తదితర సమాచారమంతా అంతర్జాలంలో నమోదు చేస్తున్నాం.
ఎం.నాగమణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, ఖమ్మం

సమాజ చైతన్యం కోసం మహాత్ముల్ని స్మరిస్తూ మిత్రురాలితో కలిసి నవగానం యూట్యూబ్ ఛానల్ ద్వారా పాటలు పాడుతున్నాం. యాప్‌ల ద్వారా ఎడిటింగ్, షేర్ చేయటం వల్ల ఎన్ని గంటల వీడియో అయినా ఒరిజనల్ క్వాలిటీతో పంపించవచ్చు. ఎన్నో వేల పుస్తకాల పీడీఎఫ్‌లను టెలిగ్రామ్ యాప్‌లో చదువుకోవచ్చు. మొబైల్‌ను సక్రమంగా వాడితే విజ్ఞానం పొందవచ్చు.
ఎం.నవజీవనప్రియ, విద్యార్థిని, ఖమ్మం

వంటల వీడియోలను యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తున్నా. గృహిణిగా ఉంటూనే నాకంటూ గుర్తింపు రావాలనే ఆలోచనతో పిల్లల దగ్గర సాంకేతిక మెలకువలు నేర్చుకున్నా. నలుగురికి ఉపయోగపడేలా, కొత్త వంటలు రుచి చూపించాలని యూట్యూబ్‌లో 'ఎస్ఎస్ వంటలు, పూజలు' పేరిట ఛానల్ ప్రారంభించాను. ఇప్పటివరకు 325 వీడియోలు పోస్ట్ చేశాను.
వి.లక్ష్మి, గృహిణి, ఇల్లెందు

నేను మేకప్ చేసిన వీడియోలను ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్‌లో పోస్ట్ చేయటం వల్ల పరిచయాలు పెరిగాయి. వాట్సప్‌లోనే మేకప్ ఆర్డర్లు వస్తున్నాయి. గతంలో ప్రైవేట్ ఉపాధ్యాయురాలిగా పనిచేశా. కొవిడ్ కాలంలో పాఠశాలలు మూతపడటంతో ఈరంగంలో శిక్షణ తీసుకుని మేకప్ ఆర్టిస్టుగా కొనసాగుతున్నా. కొన్ని టెక్నిక్స్ కోసం ఆన్‌లైన్‌లో కోర్సులు నేర్చుకుంటున్నా. వి. కల్యాణి, మేకప్ ఆర్టిస్టు, ఖమ్మం

# కొలువు ఆశజూపి.. కాసులు కొల్లగొట్టి...

కొత్తగూడెం : ఉపాధి అవకాశాల కోసం అన్వేషిస్తున్న నిరుద్యోగులను నమ్మబలుకుతూ కొత్తగూడెంలో కొందరు మోసాలకు పాల్పడుతున్నారు. ఉద్యోగాలిప్పిస్తామంటూ రూ.లక్షలు దండుకుంటున్నారు. పారిశ్రామిక ప్రాంతమవడంతో కాంట్రాక్టు ఉద్యోగాల్లో పెట్టిస్తామని దందా సాగిస్తున్నారు. సింగరేణి కొలువులు ఖాయమంటూ రూ.లక్షలకు టోకరా వేస్తున్న వైనం తాజాగా పోలీసుల వరకు వెళ్లింది.

**బోర్డు పేరు చెప్పి.. చక్రం తిప్పుతున్న 'ఆమె'**

సింగరేణి వారసత్వ ఉద్యోగాలు ఆశిస్తున్న వారికి ఆ సంస్థలో పనిచేసే ఓ ఉద్యోగి కుమార్తె ఎర వేస్తున్నారు. ఆయా నియామకాల్లో మెడికల్ బోర్డు పాత్ర కీలకంగా ఉంటుంది. కఠిన నిబంధనలు పాటిస్తూ అనర్హులను పక్కన పెడుతుంటుంది. అలాంటి భయం ఉన్న వారసులపై సదరు మహిళా దళారీ గురిపెడుతుంటారు. ఇటీవల జరిగిన మెడికల్ బోర్డులో కొత్తగూడెం ఏరియాలోని ఓ ఉపరితల గనికి సంబంధించి ఇద్దరు ఉద్యోగుల వారసులకు తన పలుకుబడితో గ్రీన్‌సిగ్నల్ లభించేలా చేయగలినట్లు సమాచారం. గతంలోనూ పలువురికి బోర్డులో అభ్యంతరాలు రాకుండా పైరవీలు చేసినందుకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల చొప్పున వసూలు చేసినట్లు తెలుస్తోంది. ఆమెను నమ్మి ఇంకొందరు రూ.10 లక్షల వరకు ముట్టజెప్పి కొలువుల కోసం నిరీక్షిస్తున్నారు.

**జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాల పేరుతో..**

సింగరేణిలో ఏడాదిన్నర క్రితం భర్తీ చేసిన జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాల పేరుతోనూ ఆ మహిళ నలుగురి వద్ద ముందస్తుగా రూ.10 లక్షలు దండుకుంది. ఉద్యోగ జాబితాలో వారికి చోటు దక్కపోవడంతో 'తొందరపడితే ఉద్యోగాలెలా వస్తాయంటూ' కాలం వెళ్లదీస్తోంది. బాధితులు ఆమెతో ఒప్పందం జరిపించిన మధ్యవర్తులను నిలదీస్తున్నారు. ఈ విషయం పోలీసుల దృష్టికి కూడా చేరింది.

**పేదలపై మరికొందరి దందా..**

సింగరేణిలో కాంట్రాక్టు పద్ధతిన నియమించుకునే సివిక్, శానిటేషన్ పనుల్లో చేర్పిస్తామని కొందరు దళారులు కొద్ది నెలలుగా నమ్మబలుతుకున్నారు. వీరికి కాస్తో కూస్తో రాజకీయ పలుకుబడి ఉంటోంది. లేదా కుటుంబంలో ఎవరో ఒకరు ప్రజాప్రతినిధై ఉంటున్నారు. సింగరేణిలో పలు స్థాయిల్లో ఉద్యోగాలు చేసేవారితో ఉన్న సంబంధాలు చూపి అమాయకులను నమ్మిస్తున్నారు. శాశ్వతోద్యోగం ఆశజూపి కొందరి రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇది నిరంతర తంతుగా మారినా పట్టించుకునే వారు లేరు. ఉద్యోగాల భర్తీ పారదర్శకంగా జరుగుతుందనే సంస్థ విజిలెన్స్ అధికారులు, ఉన్నతాధికారులు, కలెక్టర్, ఎస్పీ ఇకనైనా దళారుల మోసాలకు అడ్డుకట్ట వేయాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

సింగరేణిలో ఉద్యోగాల నియామక ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరుగుతుంది. ఎవరైనా ఉద్యోగాలిప్పిస్తామంటూ మభ్యపెడితే సంస్థ అధికారులకు నేరుగా ఫిర్యాదు చేయాలి. నిరుద్యోగులు విచక్షణ కోల్పోయి దళారుల వలలో చిక్కొద్దు. నియామకాల సమయంలో ప్రతీసారి యువతను సంస్థ తరఫున చైతన్యపరిచేందుకు ప్రయత్నిస్తున్నాం. బోర్డు మెడికల్ కేసుల్లో ఎవరైనా పనిచేయిస్తామని చెబితే ఫిర్యాదు చేయాలి. బలరాం, డైరెక్టర్ (పా)

# ఉపాధి కల్పించిన సంస్థకే టోకరా

వరంగల్ : ఉపాధి కల్పించిన వ్యాపార సంస్థలోనే చోరీ చేశాడు ఓ ప్రబుద్ధుడు. రూ.22 లక్షల విలువ చేసే 78 చరవాణులు చోరీ చేసి పట్టుబడ్డాడు. నిందితుడితో పాటు సహకరించిన వ్యక్తిని అరెస్టు చేసిన పోలీసులు వారి నుంచి కారు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో సీపీ ఏవీ రంగనాథ్ నిందితుల వివరాలను వెల్లడించారు... వరంగల్ పాపయ్యపేట్ చమన్‌కు చెందిన మహ్మద్ రబ్బాని అలియాస్ అంబాని 2018 -21 మధ్య కాలంలో హనుమకొండ చౌరస్తాలోని లాట్ మొబైల్‌లో ఉద్యోగం చేశారు. ఆయన వ్యవహారశైలి సరిగా లేకపోవడంతో పనిలో నుంచి యాజమాన్యం తొలగించింది. అప్పటికే మహ్మద్ రబ్బాని ఆ దుకాణం డూప్లికేట్ తాళంచెవి తయారు చేయించి దగ్గర పెట్టుకున్నారు. ఈ క్రమంలో షేర్‌మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టి అప్పుల పాలయ్యారు. జల్సాలకు అలవాటు పడ్డారు. అప్పుల నుంచి బయట పడడానికి తాను పని చేసిన మొబైల్ షాపులో దొంగతనం చేయాలని నిర్ణయించుకున్నారు. గత జనవరి 13న జస్ట్ డయిల్ యాప్ ద్వారా వర్ధన్నపేట మండలం ఇల్లందు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వద్ద కారు అద్దెకు తీసుకున్నారు. 14న అర్ధరాత్రి దాటాక లాట్ మొబైల్ దుకాణం వద్దకు వెళ్లి సీసీ కెమెరాల వైర్లు కత్తిరించారు. తన వద్ద ఉన్న తాళంచెవితో తాళాలు తీసి చరవాణులను గోనె సంచిలో వేసుకొని కారులో రాయపర్తి శివారులోని కెనాల్ వద్దకు చేరుకున్నారు. అందులో తాళంచెవులు, సీసీ కెమెరాల డీవీఆర్ బాక్స్‌లను విసిరేశారు. వరంగల్‌లో తాను అద్దెకు తీసుకున్న గదిలో చరవాణులను భద్రపర్చారు. వాటిలో నుంచి రెండు చరవాణులను తనకు పరిచయం ఉన్న ములుగు జిల్లా కేంద్రానికి చెందిన మహ్మద్




ఫిరోజ్‌కు ఇచ్చి విక్రయించాలని చెప్పారు. హైదరాబాద్ జగదీశ్‌మార్కెట్‌లో కొంత దొంగసొత్తును విక్రయించారు. మరికొన్ని చరవాణులను దిల్లీకి వెళ్లి ఓఎల్ఎక్స్ యాప్ ద్వారా అమ్మారు. వచ్చిన డబ్బులను జల్సాలు చేస్తూ ద్విచక్ర వాహనాన్ని కొనుగోలు చేసి చిక్కకుండా తిరుగుతున్నారు. అప్పటికే హనుమకొండ పోలీసులు కేసు నమోదు చేసి గాలిస్తున్నారు. ఈ క్రమంలో కొన్ని చరవాణులను హైదరాబాద్‌లో విక్రయించేందుకు మహ్మద్ రబ్బాని, మహ్మద్ ఫిరోజ్ వెళ్తున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో అలంకార్ కూడలిలో తనిఖీలు నిర్వహించి పట్టుకున్నట్లు సీపీ వెల్లడించారు.

# నగరాభివృద్ధికి పరుగులు

కరీంనగర్ : పెండింగ్ పనులతో పాటు కొత్తగా చేపట్టే అభివృద్ధి పనులకు ఎట్టకేలకు ప్రభుత్వం నుంచి అనుమతి లభించింది. కరీంనగర్ నగరపాలక సంస్థకు ముఖ్యమంత్రి హామీ నిధులు గతంలో మంజూరు చేయడంతో కనీస సౌకర్యాలు మెరుగుపర్చుకోవడానికి వీలు కలిగింది. ఆరేళ్ల కిందట మొత్తం మూడు విడతలుగా రూ.347.23 కోట్లు నగరానికి నిధులు మంజూరయ్యాయి. మొదటి విడత మార్చి 2017లో రూ.100 కోట్లు, రెండోవిడత డిసెంబర్ 2017లో రూ.147.23 కోట్లు, సెప్టెంబర్ 2018లో మూడో విడతలో రూ.100 కోట్లు కేటాయించారు. ఆ సమయంలో ఏ డివిజన్‌లో అడుగులేసినా అభివృద్ధి పనుల జోరు కనిపించింది. అదే తరహాలో ప్రస్తుతం అన్ని డివిజన్‌లలో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి పైపులైన్ల విస్తరణ వంటి పనులు చేసుకునే వీలు కలగనుంది.

**ప్రతీ డివిజన్‌కు నిధులు**

స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో లేని కాలనీలు, శివారు ప్రాంతాలు, విలీన



కాలనీలకు సీఎంఏ నిధులలో ప్రాధాన్యం ఇచ్చారు. ఒక్కో డివిజన్‌కు కనీసం రూ.కోటి నుంచి రూ.4 కోట్ల వరకు కేటాయించినట్లు తెలిసింది. ఒక్కో విలీన కాలనీకి సుమారు రూ.3 కోట్లకు తగ్గకుండా నిధులు మంజూరు చేసినట్లుగా చెబుతున్నారు. పెండింగ్‌లో ఉన్న పనులు కూడా ఇందులోనే పూర్తి చేసే అవకాశముంది.

**ప్యాకేజీ పద్ధతిలో..**

స్మార్ట్‌సిటీలో ప్యాకేజీ పద్ధతిలోనే అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. తద్వారా నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేస్తుండటంతో సీఎంఏ నిధులకు సంబంధించి కొత్తగా ఇచ్చిన ప్రతిపాదనలకు సింగిల్ ప్యాకేజీలో టెండర్లు పిలిచేలా పురపాలక శాఖ జారీ చేసిన ఉత్తర్వులో స్పష్టం చేశారు. గతంలో టెండర్లు దక్కించుకొని పనులు చేయకుండా మొండికేసిన గుత్తేదారులతో ప్రజలు, పాలకవర్గ సభ్యులు నానా అవస్థలు పడ్డారు. పైగా పనులు చేసేందుకు తవ్వి వదిలేయడంతో రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈ పరిస్థితి రాకుండా గడువులోగా, ఏకకాలంలో పనులు చేసేలా కార్యాచరణ చేసినట్లుగా తెలుస్తోంది.

**15లోగా టెండర్లు** ముఖ్యమంత్రి హామీ నిధులకు సంబంధించి మిగులు నిధులు రూ.132.94 కోట్లకు పురపాలక పరిపాలన, పట్టణావృద్ధి శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆర్వింద్‌కుమార్ ఈ నెల 24న మెమో జారీ చేశారు. నిధులకు పరిపాలన అనుమతి ఇస్తూ త్వరితగతిన టెండర్లు పిలిచి అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. దాంతో సుమారు 166కి పైగా పనులు చేపట్టేందుకు వీలు కలిగింది. సీఎంఏ నిధుల మంజూరు నేపథ్యంలో వచ్చే నెల 15లోగా టెండర్లు పూర్తి చేసి ఆ నెలాఖరులోగా పనులు ప్రారంభిస్తామని కరీంనగర్ మేయర్ సునీల్‌రావు పేర్కొన్నారు.

# నీళ్లిచ్చే కాల్వలపై నిర్లక్ష్యం

జగిత్యాల : సాధారణంగా జూన్ మొదటి పక్షం నుంచి వానాకాలం పంటలసాగు మొదలవుతుండగా ఈ వానాకాలంలో నెల రోజుల ముందుగానే సాగు చేపట్టాలని రాష్ట్రప్రభుత్వం రైతులకు సూచిస్తోంది. ఈ తరుణంలో పంటకాలం ముందుకు జరిగేలా పలు వ్యవసాయ అనుబంధ శాఖలు సిద్ధమవుతుండగా నీటిపారుదల పరంగానూ తగిన మరమ్మతు చర్యలను చేపట్టాల్సి ఉంది.

జగిత్యాల జిల్లాలో దాదాపు 87 శాతం వరకు అధికవర్షం కురియటం, ఏప్రిల్ వరకు కాలువనీరు రావటంతో ఆయకట్టులో తలపెట్టిన మరమ్మతులు పూర్తికాలేదు. దీంతో తక్షణమే మరమ్మతులు చేపట్టకుంటే కాలువల చివరి ఆయకట్టు వరకు నీరందటం గగనంగా మారనుంది. కాకతీయ ప్రధాన కాలువ, డిస్ట్రిబ్యూటరీలు, ఉప కాలువల లైనింగ్ దెబ్బతినటం, కాలువల్లో చెట్లు పెరగటం, షట్టర్లు, కట్టలు శిథిలం కావటం తదితరాలతో నీటి తరలింపు సామర్థ్యం తగ్గింది. 9 వేల క్యూసెక్కుల సామర్థ్యంగల కాకతీయ కాలువలోనే ప్రస్తుతం 6 వేల క్యూసెక్కులకు మించి నీటిని తరలిస్తే గండ్లు పడుతుండటంతో తక్కువనీటినే వదులుతున్నారు. యూటీలు, డ్రాపులు, సూపర్ ప్యాసేజ్‌లు, అక్విడెక్టులు తదితర నిర్మాణాలు దెబ్బతినటంతో నీటిని తరలించలేని పరిస్థితి తలెత్తింది. కాలువల్లో నిండుగా నీటిని వదలకపోగా పారే కొద్దిపాటి నీటిని మోటార్ల ద్వారా ఎత్తిపోయటంతో 38 వేల ఎకరాల చివరి ఆయకట్టుకు నీరందని పరిస్థితి నెలకొంది. దీనికిగాను కాలువల లైనింగ్‌ను పూర్తిచేయాలి.

నిధుల విడుదలలో జాప్యంవరదకాలువ నుంచి కాకతీయ కాలువలోకి నీటిని తరలించేలా మల్యాల మండలంలో చేపట్టిన అనుసంధాన కాలువ నిర్మాణం పూర్తికావటంతో వచ్చే సీజనుకు అందుబాటులోకి తేవాలి. దెబ్బతిన్న నిర్మాణాలకు సీజన్ విరామంలో మరమ్మతుల ద్వారా చివరిభూముల వరకు నీటిని తరలించేలా చూడాలి. ప్రస్తుతం రూ.103 కోట్లవరకు మరమ్మతులు, ఇతర పనులకు వెచ్చించినా సకాలంలో నిధులు రాక చాలావరకు పనులను చేపట్టలేదు. ఇప్పటికైనా అన్ని మరమ్మతు, లైనింగ్ పనులను పూర్తిచేస్తే వచ్చే పంటకాలాల్లో కర్షకులకు ఉపయుక్తంగా ఉంటుంది. కాకతీయ కాలువతో పాటుగా వరదకాలువనుంచి చెరువులు, కుంటల్లోకి నీటిని తరలించే తూములు, కాలువల నిర్మాణాన్ని పూర్తిచేయాలి. గొలుసుకట్టు చెరువుల్లోకి నీటిని తరలిస్తే భూగర్భ జలమట్టం పెరిగి పంపుసెట్ల ద్వారానూ నీటిని పారించవచ్చు. పరాధీనమైన ప్రాజెక్టు భూములను స్వాధీనం చేసుకోవాలి. చెక్‌డ్యాంలు పూర్తిచేయాలి...రోళ్లవాగు ప్రాజెక్టును రూ.120 కోట్ల నిధులతో ఆధునికీకరిస్తున్నా దీనికి ఎస్సారెస్పీ నీటితోనే నింపాల్సి ఉంటుంది. ఎస్సారెస్పీ నిండని సందర్భాల్లో 2.5 టీఎంసీల సామర్థ్యం కలిగిన రోళ్లవాగులోకి గోదావరి నీటిని ఎత్తిపోసేలా బీర్పూర్ మండలం రంగసాగర్‌వద్ద ఎత్తిపోతల పథకాన్ని చేపట్టాలి. గోదావరి నుంచి జగిత్యాల జిల్లాలోని 26 గ్రామాలకు తలపెట్టిన ఎత్తిపోతల పథకాలను పూర్తిచేయాలి. ఇదివరకున్న పథకాలకు మరమ్మతులు జరపటంతో పాటుగా ఎత్తిపోతలను పొడిగిస్తే ఆయకట్టేతర మండలాలకూ ప్రయోజనం కలుగుతుంది. వాగులపై తలపెట్టిన 75 చెక్‌డ్యాంల నిర్మాణాన్ని పూర్తిచేయాలి. మిషన్ కాకతీయ ద్వారా మిగిలిన చెరువుల పునరుద్ధరణను పూర్తిచేయాలి. గతంలో మాదిరిగా సాగునీటి సంఘాలను నియమించి కాలువలు, చెరువుల నిర్వహణ, ఆజమాయిషీ, స్థానిక మరమ్మతుల బాధ్యతలను అప్పగించాలి. వీటిలో రైతులే సభ్యులుగా ఉంటారు కాబట్టి నీటి యాజమాన్యం సాధ్యమవుతుంది.



# వైకాపా అరాచకాలను సీఈసీకి వివరించాం

విజయవాడ: ప్రజల్లో వైకాపా ప్రభుత్వంపై తిరుగుబాటు వచ్చిందని.. అందుకే నకిలీ ఓట్లు చేర్చేందుకు ఆ పార్టీ నేతలు కుట్ర చేస్తున్నారని తెదేపా అధినేత చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని.. ఎప్పుడూ లేనివిధంగా అరాచకాలు జరుగుతున్నాయని ఆరోపించారు. విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహించిన సమీక్షకు జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. సీఈసీ రాజీవ్‌కుమార్‌ను కలిసి రాష్ట్రంలో ఓటరు జాబితాలో జరుగుతున్న అక్రమాలపై ఫిర్యాదు చేశారు. అనంతరం నేతలిద్దరూ మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు మాట్లాడుతూ.. “ఓటరు జాబితాలో అవకతవకలపై సీఈసీకి ఫిర్యాదు చేశాం. రాజకీయ పార్టీల నేతలు, కార్యకర్తలపై అక్రమంగా కేసులు నమోదు చేస్తున్నారు. తెదేపా, జనసేన నేతలపై సుమారు 6-7వేల కేసులు పెట్టారు. పుంగనూరు కేసులో 200 మందికి పైగా జైలుకు వెళ్లి వచ్చారు. ఎన్నికల్లో ఎవరినీ పనిచేయకుండా చేసేందుకే అక్రమ కేసులు పెడుతున్నారు. వైకాపా అరాచకాలను సీఈసీకి వివరించాం. ప్రజాస్వామ్యాన్ని కాపాడేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఎన్నికల విధులకు అనుభవం ఉన్న సిబ్బందిని నియమించాలి. సచివాలయ సిబ్బంది, వాలంటీర్లను విధుల్లో ఉంచుతారా? బీఎల్‌వోలుగా 2,600 మంది మహిళా పోలీసులను నియమించారు. అవసరమైతే కేంద్ర పోలీసు పరిశీలకులను రాష్ట్రానికి పంపాలి. ప్రజాస్వామ్య పరిరక్షణకు మా ప్రయత్నాలన్నీ చేస్తాం. ఒక్క దొంగ ఓటు ఉన్నా ఈసీ దృష్టికి తీసుకెళ్లేలా పనిచేస్తాం” అని చెప్పారు.

**ప్రతి నియోజకవర్గంలోనూ దొంగ ఓట్లు: పవన్ –** రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో నమోదవుతున్న దొంగ ఓట్లపై సీఈసీకి ఫిర్యాదు చేసినట్లు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గంలో దాదాపు లక్షకు పైగా దొంగ ఓట్లు నమోదయ్యాయని ఆరోపించారు. వైకాపా అధికారంలోకి వచ్చాక అక్రమ కేసులు పెరిగిపోయాయన్నారు. సుదీర్ఘ అనుభవం ఉన్న చంద్రబాబు అన్ని అంశాలను సీఈసీకి వివరించారని పవన్ చెప్పారు.

# రెవెన్యూ శాఖలో విప్లవాత్మక మార్పులు: మంత్రి ధర్మాన ప్రసాదరావు



తాడేపల్లి: భారతదేశంలో భూమిపై హక్కులు అనే విధానంపై క్లారిటీ కోసం గతంలో అనేక ప్రయత్నాలు జరిగాయని ఏపీ రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. 1989లో కేంద్ర ప్రభుత్వం ప్రొఫెసర్ డీసీ వైద్య ద్వారా కమిషన్ నియమించి ఎలాంటి రికార్డుల వ్యవస్థ ఉండాలో నివేదిక కోరారని చెప్పారు. ఆ కమిషన్ మన దేశంలో టైటిల్‌కి గ్యారెంటీ ఉండే వ్యవస్థ తీసుకురావాలని సిఫారసు ఇచ్చిందని చెప్పారు. ఇప్పటికిప్పుడు రాష్ట్ర ప్రభుత్వం తానంతట తానుగా టైటిలింగ్ యాక్ట్ తీసుకురాలేదని చెప్పారు. దేశ వ్యాప్తంగా టైటిలింగ్ యాక్ట్ తీసుకురావాలని ప్లానింగ్ కమిషన్, కేంద్ర ప్రభుత్వం 30 ఏళ్లుగా అధ్యయనం చేస్తోందని అన్నారు. శిస్తు వసూలు చేసుకోవడానికి 1బీ, అడంగల్ వంటివి మత్రమే తెచ్చారని తెలిపారు. భూమిపై ఇన్వెస్ట్‌మెంట్ పెట్టి ప్రాజెక్టులు టేకప్ చేసేలోపు కొన్ని వివాదాలు తలెత్తుతున్నాయని చెప్పారు. అందుకే దేశవ్యాప్తంగా 2019లోనే టైటిల్ గ్యారెంటీ చట్టాన్ని తీసుకురావాలని కేంద్రప్రభుత్వం ప్రయత్నించిందని గుర్తుచేశారు. టైటిలింగ్ గ్యారెంటీ చట్టాన్ని తీసుకురావాలని, అన్ని రాష్ట్రాలకు నీతి ఆయోగ్ సూచించిందని అ?న్నారు. నీతి ఆయోగ్ సూచనలమేరకు 2019లోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రపతికి పంపారని తెలిపారు. రెండుసార్లు వెనక్కి వెళ్లొచ్చి.. 2023లో ఆమోదం పొందిందని చె?ప్పారు. దేశంలోనే సివిల్ కోర్టుల్లోని వివాదాల్లో 66శాతం భూములకు సంబంధించిందేనని చెప్పారు. ఆ 66 శాతంలో లక్ష ఆదాయంలోపు ఉన్నవారి కేసులో 90 శాతం ఉన్నాయని పేర్కొన్నారు. ఎన్సీఆర్బీ రికార్డుల ప్రకారం 60 శాతం హత్యలు భూ వివాదాలు వల్ల జరుగుతున్నాయని అన్నారు. దేశ ప్రజల క్షేమం కోసం ఒక ప్రయత్నం జరుగుతుందని, 17 వేల గ్రామాల్లో రెవెన్యూ రికార్డుల అప్డేషన్, సర్వే జరుగుతున్నాయని చెప్పారు. ప్రపంచంలోనే అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగిస్తున్నామని, వివాదాలు లేని రికార్డులు తయారవుతాయని చెప్పారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఏపీలో జరుగుతున్న సర్వే గురించి తెలుసుకుంటున్నారని అ?న్నారు. రికార్డులన్నీ అప్ డేట్ అయ్యాక, సర్వే పూర్తయ్యాక చట్టం నోటిఫై చేస్తామని చెప్పారు. ఇదంతా అయ్యేందుకు కొన్ని నెలల సమయం పడుతుందని పేర్కొన్నారు. ఇప్పటికిప్పుడు చట్టాన్ని ఆగమేఘాలమీద అమలు చేయడం లేదని అ?న్నారు.

అన్నీ చట్ట ప్రకారం జరుగుతాయని, న్యాయస్థానాలు ఇచ్చే సలహాలు తీసుకుంటామని చెప్పారు. ఇంకా ఎలాంటి రూల్స్ విధించాలో కసరత్తు జరుగుతోందని తెలిపారు. భారత ప్రభుత్వం అధ్యయనం చేసిన అంశాల్ని రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే టేకప్ చేసిందని పేర్కొన్నారు. రూల్ ఫ్రేమ్ చేసేటప్పుడు అందరి సలహాలు పాటిస్తామని అన్నారు. న్యాయవాదులు విధులకు హాజరు కావాలని, దేశంలో కంక్లూజివ్ టైటిల్ ఇవ్వడం విశేషమని తెలిపారు.

# 29వ రోజుకు చేరుకున్న అంగనవాడీల సమ్మె

విజయవాడ, జనవరి 9: రాష్ట్రంలో అగన్వాడీలు చేపట్టిన సమ్మె 29వ రోజుకు చేరుకుంది. విజయవాడ ధర్నా చౌక్‌లో అంగన్వాడీల నిరాహార దీక్ష ఐదవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా అంగన్వాడీ మహిళలు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా ప్రయోగించినా వెనక్కి తగ్గమని స్పష్టం చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ పోరాటంపై తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. సజ్జల రామకృష్ణారెడ్డి, రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ తమ సమ్మెపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండి పడ్డారు. డిమాండ్లు పరిష్కరించామంటే అసత్యాలు ప్రచారం చేస్తున్నార న్నారు. ప్రభుత్వం ఎన్ని ఆటంకాలు సృష్టించిన సమ్మె విరమించేది లేదన్నారు. నోటీసులు ఇచ్చినా, బెదిరించినా వెనక్కి తగ్గమన్నారు. ప్రభుత్వం స్పందన బట్టే సమ్మెపై నిర్ణయం ఉంటుందని స్పష్టం చేశారు. జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయమంటే కక్ష సాధిస్తారా అంటూ అంగన్వాడీ మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



# మాల్దీవుల వివాదం వేళ.. చైనా మళ్లీ వక్రబుద్ధి..

బీజింగ్: భారత ప్రధాని మోదీ, లక్షద్వీప్ పరిసరాలపై మాల్దీవుల మంత్రులు, ఎంపీలు చేసిన వ్యాఖ్యలతో ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన విభేదాలు నెలకొన్న విషయం తెలిసిందే. దీనిపై చైనా స్పందిస్తూ మరోసారి తన వక్రబుద్ధిని చాటుకుంది. మాల్దీవులకు మరింత దగ్గరయ్యేందుకు ప్రయత్నిస్తున్న డ్రాగన్... భారత్ మరింత విశాల దృక్పథంతో ఆలోచించాలంటూ నోరు పారేసుకుంది. ఈ మేరకు చైనా అధికారిక పత్రిక గ్లోబల్ టైమ్స్ సంపాదకీయాన్ని ప్రచురించింది. “మాల్దీవులను మేం ఎప్పటికీ సమాన భాగస్వామిగా పరిగణిస్తాం. దాని సార్వభౌమత్వాన్ని గౌరవిస్తాం. భారత్, చైనా మధ్య ఘర్షణల కారణంగా దిల్లీకి దూరంగా ఉండాలని మాల్దీవులకు ఎన్నడూ చెప్పలేదు. ఈ ద్వీప దేశానికి భారత్ నుంచి వచ్చే సహకారాన్ని ముప్పుగా భావించలేదు. దక్షిణాసియాలో కొన్ని దేశాలతో దిల్లీ సంబంధాలు దెబ్బతిన్నాయి. దానికి చైనాను నిందించడం మాని.. భారత్ మరింత విశాల దృక్పథంతో విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాలి” అని కథనంలో డ్రాగన్ తన అక్కసు వెళ్లగక్కింది. కాగా.. మాల్దీవుల అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జు చైనాలో పర్యటిస్తున్న వేళ.. ఈ కథనం రావడం గమనార్హం. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఆహ్వానం మేరకు ఆయన తన సతీమణితో కలిసి బీజింగ్ చేరుకున్నారు. ఆయనకు డ్రాగన్ అనుకూలమైన వ్యక్తిగా పేరుంది. అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత.. తన మొదటి విదేశీ పర్యటన చైనాలోనే చేపట్టారు. ఈ ఏడాది సెప్టెంబరులో ముయిజ్జు మాల్దీవుల అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే.

వచ్చీ రాగానే తమ భూభాగంలో ఉన్న భారత బలగాలను తొలగించేలా చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే ఇటీవల మోదీపై, లక్షద్వీప్‌పై మాల్దీవులు మంత్రులు విద్వేష వ్యాఖ్యలు చేయడంతో వివాదం రాజుకుంది. దీన్ని దిల్లీ తీవ్రంగా పరిగణించింది.

# ఇంతమంది రోడ్డెక్కారంటే జగన్ కారణం కాదా? అంటూ కార్మికసంఘాల ఫైర్



విజయవాడ: అంగన్‌వాడీ మహిళల పోరాటంపై ఎస్మా చట్టాన్ని వ్యతిరేకిస్తూ వివిధ సంఘాల నేతలు నిరసనకు పిలుపునిచ్చారు. జైల్ భరోకు పిలుపునిస్తూ కార్మిక, విద్యార్థి, మహిళా సంఘాల నేతలు ర్యాలీ చేపట్టాయి. అలంకార్ సెంటర్లో అడ్డుకుని పోలీసులు అరెస్టు చేశారు.

జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఒక్క ఛాన్స్ అని మాయ మాటలతో జగన్ మోసం చేశారన్నారు. “వేతనాలు పెంచుతామని జగన్ హామీ ఇచ్చింది నిజం కాదా? ఈరోజు ఇంతమంది రోడ్డు ఎక్కారంటే జగన్ కారణం కాదా? సమస్య పరిష్కరించకుండా వారి పై ఎస్మా చట్టం తేవడం దుర్మార్గం. అక్రమ అరెస్టులతో మా పోరాటాన్ని ఆపలేరు. మహిళలతో కన్నీరు పెట్టించిన వారెవ్వరూ బాగు పడలేదు. మూడు నెలల్లో జగన్‌ను ఇంటికి పంపించి తీరుతాం” అని కార్మిక సంఘాలు హెచ్చరిస్తున్నాయి.

# జోడో న్యాయ యాత్రకు తరలిరండి: కాంగ్రెస్



న్యూఢిల్లీ : మణిపూర్‌లో ఈనెల 14 నుంచి ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ సారథ్యంలో చేపట్టే ‘భారత్ జోడో న్యాయ యాత్ర’లో ప్రజలు, ప్రజా సంఘాలు, పౌర సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొనాల్సిందిగా కాంగ్రెస్ పిలుపునిచ్చింది. ప్రతి భారతీయుడికి ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయం అందించడమే లక్ష్యంగా రాహుల్ ఈ యాత్ర చేపడుతున్నట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ వెల్లడించారు. ‘ప్రతి భారతీయుడికి అన్ని విషయాల్లో న్యాయం జరగాలన్న రాజ్యాంగ వాగ్దానాన్ని అందజేయాలనే నిబద్ధతను పటిష్ఠ పరిచేందుకే ఈ యాత్ర’ అని ఆయన ‘ఎక్స్’లో పేర్కొన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు ముందు చేపడుతున్న ఈ యాత్ర 66 రోజులు సాగనుంది. మార్చి 20 లేదా 21న ముంబైలో ముగియనుంది. మొత్తం 110 జిల్లాలు, 100 లోక్‌సభ స్థానాలు, 337 అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా 6,713 కిలోమీటర్ల మేర యాత్ర సాగనుంది.



# లోక్‌సభ ప్రచారానికి 13న మోదీ శ్రీకారం

న్యూఢిల్లీ : రానున్న లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి ఈ నెల 13న ప్రధాని మోదీ బిహార్‌లో శ్రీకారం చుట్టే అవకాశం ఉంది. పశ్చిమ చంపారన్ జిల్లా ముఖ్యపట్టణమైన బెతియాలోని రమణ్ మైదాన్‌లో నిర్వహించే బహిరంగ సభ ద్వారా ప్రచారాన్ని ప్రారంభిస్తారని బీజేపీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా పలు రోడ్లు, వంతెనల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నాయి. బిహార్‌లోని మొత్తం 40 లోక్‌సభ స్థానాలను దక్కించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్న బీజేపీ..అగ్రనాయకులతో ప్రచార సభలు నిర్వహించనుంది. ప్రధాని మోదీ బెతియాతో పాటు బెగుసరాయి, ఔరంగాబాద్‌ల్లోనూ జరిగే బహిరంగ సభల్లో ప్రసంగించనున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు జె.పి.నడ్డా ఈ నెల 15 తరువాత ప్రచారంలో పాల్గొంటారు. సీఎం నీతీశ్ కుమార్ నేతృత్వంలో బిహార్‌లోని ఇతర పార్టీలు కూటమిగా ఏర్పడడంతో వాటిని ఎదుర్కోవడానికి బీజేపీ అప్పుడే పావులు కదుపుతోంది.



# బోయింగ్ డేంజర్ బెల్స్..!

బోయింగ్ 737 మ్యాక్స్ రకం విమానాలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. గతంలో వరుస ప్రమాదాలతో భయపెట్టాయి.. ఇప్పుడు సాంకేతిక సమస్యలతో ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా అమెరికాలోని యునైటెడ్ ఎయిర్‌లైన్స్ సంస్థ తమ బోయింగ్ విమానాల్లో తనిఖీలు చేపట్టింది. 10 విమానాల్లో బోల్టులు వదులుగా ఉన్నట్లు తెలుస్తోంది. అమెరికాలో 737 మ్యాక్స్ మోడల్ వాడుతున్న రెండు సంస్థల్లో ఇది కూడా ఒకటి. “శనివారం నుంచి మా విమానాల్లో తనిఖీలు చేస్తున్నాం. డోర్ ప్లగ్‌లు బిగించే సమయంలో తలెత్తిన సమస్యలు ఇంకా ఉన్నట్లు గుర్తించాం” అని ఆ ఎయిర్‌లైన్స్ పేర్కొంది. అలాస్కా ఎయిర్‌లైన్స్ తనిఖీల్లోనూ ఇలాంటి లోపాలను గుర్తించినట్లు తెలుస్తోంది. యునైటెడ్ ఎయిర్‌లైన్స్ ప్రకటనతో 737 మ్యాక్స్‌పై ఆందోళనలు మరింత పెరిగాయి. ఈ నేపథ్యంలో తనిఖీలపై మార్గదర్శకాలను తయారు చేసేందుకు బోయింగ్-అమెరికా ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ మధ్య చర్చలు జరుగుతున్నాయి. ఇప్పటికే కొన్ని మార్గదర్శకాలను బోయింగ్ ఎఫ్ఏఏ వద్దకు పంపింది. ‘మ్యాక్స్’లను వాడుతున్న ఎయిర్‌లైన్స్‌తో తాము టచ్‌లో ఉన్నామని తెలిపింది. అలాస్కా ఎయిర్‌లైన్స్ ప్రస్తుత పరిణామాలపై స్పందిస్తూ.. తుది మార్గదర్శకాల కోసం ఎదురు చూస్తున్నట్లు వెల్లడించింది. 737మ్యాక్స్ విమానాల్లో ఎమర్జెన్సీ ఎగ్జిట్‌ను రీప్లేస్ చేసేందుకు వీలుగా డోర్‌ప్లగ్ ప్యానళ్లను అమర్చుతున్నారు. చాలా మంది ఆపరేటర్లు పల్చటి వెర్షన్‌లను వాడుతున్నారు. వీటిని రెండు దశల్లో బిగిస్తారు. తొలుత విడిభాగాల సరఫరాదారు స్పిరిట్ ఏరోసిస్టమ్స్ తాత్కాలికంగా అమర్చగా.. ఆ తర్వాత మిగిలిన పనిని బోయింగ్ పూర్తి చేస్తోంది. ఈ నేపథ్యంలో రెండు సంస్థల తయారీ, నిర్వహణ రికార్డులను కూడా ఇప్పుడు ఎఫ్ఏఏ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. దీంతో స్పిరిట్ కంపెనీ షేర్లు సోమవారం 11 శాతం కుంగాయి.

**అసలేమిటీ డోర్ ప్లగ్‌లు..** విమానంలో అత్యవసర పరిస్థితి తలెత్తినప్పుడు కేవలం 90 సెకన్లలో వందల మంది ప్రయాణికులను కిందకు దించాలి. ఒకటే ఎగ్జిట్ డోర్ ఉంటే ఇది సాధ్యం కాదు. అందుకే తగినన్ని ఎమర్జెన్సీ ఎగ్జిట్‌లు ఉండాలి. కొన్ని చోట్ల వీటిని అమర్చడం సాధ్యంకాదు. దీంతో డోర్‌ప్లగ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. సాంకేతికంగా ఇవి అత్యవసర ద్వారాలు కాదు.



# నాలుగేళ్ల కుమారుడిని చంపిన సీఈవో..

పనాజీ/బెంగళూరు: ఓ మహిళా వ్యాపారవేత్త తన నాలుగేళ్ల కుమారుడిని అతి దారుణంగా హత్య చేసింది. ఎవరికీ అనుమానం రాకుండా ఆ చిన్నారి మృతదేహాన్ని బ్యాగులో దాచిపెట్టి.. గోవా నుంచి కర్ణాటక వరకు ట్యాక్సీలో ప్రయాణించింది. పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి ఆమెను అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. బెంగళూరుకు చెందిన సుచనా సేత్ ఓ స్టార్టప్‌ని స్థాపించి, సీఈవోగా వ్యవహరిస్తోంది. గత శనివారం ఆమె తన నాలుగేళ్ల కుమారుడిని తీసుకుని ఉత్తర గోవాలోని ఒక హోటల్‌కు వెళ్లింది. సోమవారం ఉదయం అక్కడ గదిని ఖాళీ చేసి ట్యాక్సీలో కర్ణాటకకు బయల్దేరింది. ఆ గదిని శుభ్రం చేసేందుకు వెళ్లిన సిబ్బంది.. అక్కడ రక్తపు మరకలను గుర్తించారు. హోటల్ యాజమాన్యం ఇచ్చిన సమాచారంతో అక్కడకు చేరుకున్న పోలీసులు సీసీటీవీ దృశ్యాలను పరిశీలించారు. హోటల్‌లో దిగినప్పుడు కుమారుడితో కలిసి కన్పించిన సుచనా.. వెళ్లేటప్పుడు మాత్రం ఒంటరిగా కన్పించడంతో పోలీసులకు అనుమానం వచ్చింది. వెంటనే ఆమె వెళ్లిన ట్యాక్సీ డ్రైవర్‌కు పోలీసులు ఫోన్ చేసి సుచనాతో మాట్లాడారు. అయితే, తన కుమారుడిని ఫ్రెండ్ ఇంటి వద్ద వదిలేసినట్లు ఆమె చెప్పింది. సుచనా ఇచ్చిన ఫ్రెండ్ అడ్రస్ నకిలీదని తేలడంతో పోలీసుల అనుమానం బలపడింది. వెంటనే కర్ణాటక పోలీసులకు సమాచారమిచ్చారు. అదే సమయంలో, ట్యాక్సీ డ్రైవర్‌ను సంప్రదించి అనుమానం రాకుండా ఆమెను సమీపంలోని పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లాలని సూచించారు. చివరకు కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లాలో పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఆమె బ్యాగులో చిన్నారి మృతదేహాన్ని గుర్తించారు. సుచనాను అరెస్టు చేశారు. హత్యకు గల కారణాలు తెలియరాలేదు. దీనిపై దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## లేట్ అయినా లేటెస్ట్- అలియా మైండ్ బ్లాక్ బికినీ

బాలీవుడ్ క్యూట్ బ్యూటీగా పేరు దక్కించుకుని స్టార్ హీరోయిన్ గా ఎదిగిన ముద్దుగుమ్మ ఆలియా భట్. కెరీర్ పీక్స్ లో ఉన్న సమయంలోనే బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌బీర్ కపూర్ ను వివాహం చేసుకుంది. ఆ తర్వాత 2022 నవంబర్ లో పండంటి ఆడబిడ్డకు కూడా ఆలియా జన్మనిచ్చిన విషయం తెలిసిందే. సాధారణంగా కొందరు హీరోయిన్లు పిల్లలు పుట్టగానే కెరీర్ ముగిసింది అనుకుంటారు. కానీ ఆలియా మాత్రం బిడ్డకు జన్మనిచ్చిన వెంటనే షూటింగ్ హాజరై వరుస సినిమాలతో దూసుకెళ్తోంది. అటు సోషల్ మీడియాలోనూ అందాలు ఆరబోస్తుంది. కొత్త కొత్త ఫొటో షూట్స్ పోస్ట్ చేస్తుంటుంది. కెరీర్, పర్సనల్, బిజినెస్ అప్డేట్లు షేర్ చూస్తూ యాక్టివ్ గా ఉంటోంది. తాజాగా ఈ బ్యూటీ చేసిన ఇన్ స్టా పోస్ట్ ఫుల్ వైరల్ గా మారింది. న్యూఇయర్ వెకేషన్ లో దిగిన మిర్రర్ సెల్ఫీలతో పాటు వీడియోలను పోస్ట్ చేసింది. %Many moods & a million mirror selfies% అంటూ క్యాప్షన్ ఇచ్చింది. ఆ పిక్స్ లో రణ్ బీర్, రాహా లేకపోయినా తన నేచురల్ లుక్స్ తో ఆలియా



ఆకట్టుకుంది. సింపుల్ ఫ్రాక్స్ లో తన అందంతో మైమరిపించింది. పింక్ కలర్ స్విమ్ షూట్ లో గ్లామర్ తో అదరగొట్టింది. స్కై కలర్ డ్రెస్ లో సముద్రాన్ని ఫిదా చేసేసింది! ఆలియా తన భర్త, నటుడు రణ్ బీర కపూర్, కుమార్తె రాహాతో కలిసి న్యూఇయర్ వేడుకలు జరుపుకుని శుక్రవారమే ముంబయి చేరుకుంది. ఆ సమయంలో రాహాను క్లిక్ మనిపించేందుకు ఫొటోగ్రాఫర్లు తెగ పోటీపడ్డారు. అందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు వైరల్ గా మారాయి. క్రిస్మస్ సందర్భంగా తొలిసారి రాహా ఫేస్ రివీల్ చేశారు రణ్ బీర్, ఆలియా. ఇప్పటికీ క్యూటీ రాహా పిక్స్ ట్రెండింగ్ లో ఉన్నాయి. ఇటీవల గంగూబాయ్ సినిమాకు ఉత్తమ నటిగా జాతీయ అవార్డు అందుకున్న ఆలియా భట్ ప్రస్తుతం హిందీలో పలు సినిమాల్లో నటిస్తోంది. గర్భిణిగా ఉన్న సమయంలో కాస్త బ్రేక్ తీసుకున్న ఆలియా భట్ మళ్లీ స్పీడ్ పెంచింది. డైరెక్టర్ వాసన్ బాలా తెరకెక్కిస్తున్న జిగ్రాలో కనిపించనుంది. ఫర్హాన్ అక్తర్ దర్శకత్వం వహిస్తున్న జీ లే జరాలో కూడా నటిస్తోంది. ఈ సినిమాలో ఆమెతోపాటు కత్రినా కైఫ్, ప్రియాంక చోప్రా నటించనున్నారు. మరోవైపు, సినిమాలతోపాటు క్లాతింగ్ బిజినెస్ లో కూడా దూసుకెళ్తోంది.

## గుంటూరు కారం : ఆమెను సరిగ్గా వాడి ఉంటారా?

సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న గుంటూరు కారం సినిమా లో మహేష్ బాబుకు జోడీగా మొదట పూజా హెగ్డేను హీరోయిన్ గా ఎంపిక చేసి, సెకండ్ హీరోయిన్ పాత్రకు గాను శ్రీలీలను తీసుకున్నారు. కానీ తర్వాత రోజుల్లో అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్న విషయం తెల్సిందే. గుంటూరు కారం సినిమా నుంచి కొన్ని కారణాల వల్ల పూజా హెగ్డే తప్పుకున్న విషయం తెల్సిందే. దాంతో ఆ స్థానంలో శ్రీలీల మెయిన్ హీరోయిన్ గా మారింది. ఇక సెకండ్ హీరోయిన్ పాత్రకి గాను అందమైన మీనాక్షి చౌదరిని ఎంపిక చేయడం తో సినిమాపై మరింతగా అంచనాలు పెంచారు. త్రివిక్రమ్ దర్శకత్వంలో ఇద్దరు ముద్దుగుమ్మలు ఉండటం ఇప్పుడు



కొత్తేం కాదు. అత్తారింటికి దారేది సినిమాలో ప్రణీత మొదలుకుని మొన్నటి అల వైకుంఠపురంలో నివేదా పేతురాజ్ వరకు ఎంతో మంది ముద్దుగుమ్మలను సెకండ్ హీరోయిన్ గా చూపించాడు. పేరుకు సెకండ్ హీరోయిన్ కానీ, సినిమాలో వారికి అస్సలు ప్రాముఖ్య ఉండదు. అసలు ఆ పాత్రలు ఎందుకు ఉన్నాయి అనేది చాలా సినిమాల్లో త్రివిక్రమ్ సరిగ్గా చెప్పే ప్రయత్నం కూడా చేయలేదు. దాంతో గుంటూరు కారం సినిమాలో సెకండ్ హీరోయిన్ గా నటిస్తున్న మీనాక్షి చౌదరికి కూడా పెద్దగా ప్రాముఖ్యత ఉండక పోవచ్చు అంటున్నారు. తాజాగా విడుదల అయిన గుంటూరు కారం కొత్త పోస్టర్ లో మీనాక్షి చౌదరి చాలా అందంగా కనిపిస్తుంది. కనుక సినిమాలో ఆమె ఎలా ఉంటుందా అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ మధ్య కాలంలో శ్రీలీలతో పోల్చితే మీనాక్షి చౌదరి అందంగా మరియు సక్సెస్ ఫుల్ గా కనిపిస్తోంది. అందుకే ఈ అమ్మడికి గుంటూరు కారం లో మంచి స్కోప్ దక్కితే భవిష్యత్తుకు బాగుంటుందని చాలా మంది అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మరి మీనాక్షి ని త్రివిక్రమ్ సరిగ్గా వాడి ఉంటారా అనేది తెలియాలంటే మరో వారం రోజులు వెయిట్ చేయాల్సిందే.




## ఫైటర్ థీమ్ సాంగ్: భారత వైమానిక దళం పోరాట స్ఫూర్తితో



వార్- పఠాన్ చిత్రాలతో సంచలన విజయాలు సాధించిన సిద్ధార్థ్ ఆనంద్ తదుపరి వెంచర్ ఫైటర్ ఇప్పటికే క్యూరియాసిటీని పెంచిన సంగతి తెలిసిందే. భారతదేశంలో మొదటి ప్రధాన వైమానిక యాక్షన్ చిత్రమిది. హృతిక్ రోషన్- దీపిక పదుకొనే తొలి కలయికలో రూపొందుతున్న ఈ చిత్రం 2024 మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియన్ సినిమాల్లో ఒకటి. ఇటీవల ఫైటర్ డ్యాన్స్ ట్రాక్ 'షేర్ ఖుల్ గయే'.. రొమాంటిక్ సాంగ్ 'ఇష్క్ జైసా కుచ్'లో విడుదలై అభిమానుల్లోకి దూసుకెళ్లాయి. పెప్పీ నంబర్‌లకు అద్భుత స్పందన వచ్చింది. భారతీయ వైమానిక దళం స్ఫూర్తిని సెలబ్రేట్ చేస్తూ రూపొందించిన 'హీర్ ఆస్మానీ' పైలట్ థీమ్ సాంగ్ టీజర్‌ను తాజాగా చిత్రబృందం విడుదల చేసింది. హీర్ ఆస్మానీ టీజర్ దేశభక్తిని రగిలించే పాట. మన దేశాన్ని రక్షించే ఫైటర్ పైలట్‌లకు సంబంధించిన గీతమిది. భారత వైమానిక దళం పరాక్రమాన్ని ఎలివేట్ చేసేలా దీనిని రూపొందించారు. హృతిక్, దీపికలతో పాటు ఇతర తారాగణం అంతా టీజర్‌లో కనిపించారు. ముఖ్యంగా ఫైటర్ జెట్‌లను రన్నింగ్ ట్రాక్ పైకి తీసుకెళుతున్న హృతిక్ – దీపిక విజువల్స్ ఎంతో క్యూరియాసిటీని కలిగిస్తున్నాయి. జనవరి పాట విడుదలకు సిద్ధంగా ఉంది. టీజ ర్‌ను సోషల్ మీడియాలో హృతిక్ రోషన్ పోస్ట్ చేసారు. %FighterOn25thJanన విడుదలవుతుందని ప్రకటించారు. ఈ చిత్రాన్ని మార్ఫిక్స్ పిక్చర్స్‌తో కలిసి వయాకామ్ 18 స్టూడియోస్ సమర్పించింది. హృదయాన్ని కదిలించే యాక్షన్ దేశభక్తి నేపథ్యంలోని ఈ సినిమాతో సిద్ధార్థ్ ఆనంద్ భారీ విజయంపై కన్నేసారు. ఈ చిత్రంలో హృతిక్ రోషన్, దీపికా పదుకొణె, అనిల్ కపూర్, అక్షయ్ ఒబెరాయ్, కరణ్ సింగ్ గ్రోవర్ తదితరులు ఎయిర్ ఫోర్స్ ఆఫీసర్స్ పాత్రలో నటించారు.

**టాప్ గన్ స్ఫూర్తితో..? :** ఫైటర్ సినిమాని ప్రకటించే క్రమంలోనే హాలీవుడ్ యాక్షన్ హీరో టామ్ క్రూజ్ నటించిన టాప్ గన్ విడుదలైన సంగతి తెలిసిందే. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదలై భారీ విజయాన్ని సాధించింది. కరోనా క్రైసిస్ లోను అద్భుత వసూళ్లను దక్కించుకున్న చిత్రమిది. ఇప్పుడు అదే తరహా కాన్సెప్ట్ తో ఇండియన్ వెర్షన్ గా ఫైటర్ కథాంశం ఉండనుందని టాక్ వినిపిస్తోంది.

## దేవుడు రాసిన కమ్మని కావ్యం.. నా సామి రంగా హార్ట్ టచింగ్ సాంగ్




టాలీవుడ్ సీనియర్ హీరో అక్కినేని నాగార్జున నటించిన తాజా చిత్రం నా సామి రంగ. అమిగోస్ ఫేమ్ ఆషికా రంగనాథ్ ఫిమేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. అల్లరి నరేశ్, రాజ్ తరుణ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. మేకర్స్ ఇప్పటికే లాంచ్ చేసిన నా సామి రంగ టైటిల్ గ్లింప్స్, పాత్రల ఇంట్రోస్, పాటలు ప్రేక్షకులను తెగ ఆకట్టుకుంటున్నాయి. సినిమాపై మరిన్ని అంచనాలు పెంచుతున్నాయి. జనవరి 14న థియేటర్లలో గ్రాండ్‌గా ఈ మూవీ విడుదలవుతున్న నేపథ్యంలో ప్రమోషన్స్‌లో భాగంగా మరో అప్డేట్ ఇచ్చారు మేకర్స్. విజిల్ థీమ్ పేరుతో ఈ సినిమా నుంచి మూడో సాంగ్ ను విడుదల చేశారు. కిష్టయ్య %ట% అంజి – దేవుడి ద్వారా ఏర్పడిన ప్రత్యేక బంధమంటూ ఎమోషనల్ ఫ్రెండ్షిప్ సాంగ్ ను రిలీజ్ చేశారు. యువ గాయకుడు శాండిల్య పీసపాటి ఆ పాటను ఆలపించారు. ఆస్కార్ విన్నర్ ఎంఎం కీరవాణి లిరిక్స్ రాసి బాణీలు అందించారు. దేవుడే రాసిన కమ్మని కావ్యమంటూ సాగిన ఈ పాటలో నాగార్జున, అల్లరి నరేశ్ మధ్య స్నేహాన్ని చూపించారు. చిన్నప్పటి నుంచి వారి బంధాన్ని హృదయాన్ని హత్తుకునేలా మేకర్స్ చూపించారు. ప్రస్తుతం ఈ సాంగ్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. పాట ఫుల్ హార్ట్ టచింగ్ గా ఉందంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. ఆస్కార్ విన్నర్ కీరవాణి మరోసారి తన మార్క్ చూపించారని అంటున్నారు. శాండిల్య తన గానంతో పాటకు ప్రాణం పోశారని చెబుతున్నారు. ఈ మూవీలో అంజిగాడు (అల్లరి నరేశ్) ప్రాణాన్ని కూడా ఇటీవలే పరిచయం చేశారు మేకర్స్. మిర్నా మీనన్ లుక్ విడుదల చేశారు. మిర్నా ఈ మూవీలో మంగ పాత్రలో కనిపించనుంది. నెత్తిన మల్లెపూలు, చేతిలో సద్దిమూటతో పొలంలో నుంచి నడుచుకుంటూ వెళ్తున్న లుక్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. నా సామి రంగ ట్రైలర్‌ను జనవరి 9వ తేదీన విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ మూవీ డిజిటల్ స్ట్రీమింగ్ రైట్స్‌ను పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం డిస్నీంహాట్ స్టార్ దక్కించుకుంది. పవన్ కుమార్ సమర్పణలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి ప్రసన్నకుమార్ బెజవాడ కథ అందించారు. శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ అధినేత, ప్రముఖ నిర్మాత శ్రీనివాస చిట్టూరి నిర్మించారు.

## పండగ తర్వాత నా సామి రంగ ఆమె బిజీ బిజీ...!

సంక్రాంతి సందర్భంగా విడుదల అవ్వబోతున్న నాలుగు సినిమాల్లో నాగార్జున నా సామి రంగ ఒకటి. ఈ సినిమాకు సంబంధించిన ప్రమోషన్ కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే నా సామి రంగ సినిమా పక్కా సంక్రాంతి మార్క్ పండుగ సినిమా అనిపించేలా ప్రమోషన్స్ చేస్తున్నారు. ఇక ఈ సినిమాలో హీరోయిన్ గా నటించిన ఆషికా రంగనాథ్ గురించి సోషల్ మీడియాలో ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఈ కన్నడ బ్యూటీ ని ఎక్కడ పట్టుకున్నారో కానీ భలే ఉంది అంటూ ఇప్పటికే ప్రేక్షకులు ఆమెకు పాస్ మార్కులు వేశారు. సినిమాలో ఆమె పాత్ర అత్యంత కీలకం గా ఉండబోతుందని ట్రైలర్ లో చెప్పకనే చెప్పారు. తాజాగా దర్శకుడు విజయ్ బిన్నీ మాట్లాడుతూ ఈ సినిమాలో హీరోయిన్ పాత్రకు చాలా ప్రాముఖ్యత ఉంది. అందుకే నాగ్ కి జోడీగా నటింపజేసేందుకు చాలా మంది హీరోయిన్స్ ను పరిశీలించాం. చివరకు ఆ పాత్రకు



ఆషికా రంగనాథ్ అయితే బాగుంటుంది అంటూ నిర్ణయించుకున్నాం. నా సామి రంగ సినిమా విడుదల తర్వాత కచ్చితంగా టాలీవుడ్ లో ఆషికా పేరు మారు మ్రోగడం ఖాయం అని ఆయన నమ్మకం వ్యక్తం చేశాడు. మీడియా వర్గాల వారు కూడా ఆషియా విషయంలో ప్రత్యేకంగా శ్రద్ధ కనబరుస్తూ ఉన్నారు. ఇప్పటికే ఆమెను పలువురు నిర్మాతలు సంప్రదింపులు మొదలు పెట్టినట్లుగా తెలుస్తోంది. ఆషికా మొదటి తెలుగు సినిమా నా సామి రంగ పాజిటివ్ టాక్ ను దక్కించుకుంటే టాలీవుడ్ లో మోస్ట్ బిజీ హీరోయిన్ గా మారే అవకాశాలు ఉన్నాయి. వచ్చే ఏడాదికి ఆషికా మోస్ట్ బిజీ హీరోయిన్ అవ్వడం ఖాయం అంటూ సినీ వర్గాల వారు కూడా నమ్మకంగా ఉన్నారు. మరి ఆషికా మొదటి విజయాన్ని నా సామి రంగ తో దక్కించుకుంటుందా అనేది చూడాలి.

## రెడ్ ఫ్రాకులో అందాల మౌనిరాయ్

దిశా పటానీ – మౌని రాయ్ B-టౌన్‌లో అత్యంత ఆకర్షణీయమైన బెస్ట్ ఫ్రెండ్స్. ఆ ఇద్దరూ ఒకరిని విడిచి ఒకరు విడివిడిగా కనిపించడం లేదు. ఇటీవల మౌని కొత్త రెస్టారెంట్ ప్రారంభ కార్యక్రమంలో దిశా సందడి చేసింది. ఈ ఇద్దరూ ఆకర్షణీయంగా కనిపించారు. బోల్డ్ ఫ్యాషన్ ఎంపికలతో పాపులరైన ఈ జంట తమ ప్రత్యేక శైలితో షో స్టాపర్ గా నిలిచారు. ఇంతలోనే కొత్త సంవత్సర వేడుకల కోసం దుబాయ్ కి వెళ్లిన ఈ జోడీ అక్కడ ఆకాశహర్మ్యాల నుంచి ఫోటోషూట్లను షేర్ చేస్తున్నారు. ఇవి వేగంగా వైరల్ అయిపోతున్నాయి. ఆ ఇద్దరూ గ్లామర్ ఎలివేషన్ పరంగా ఒకరితో ఒకరు పోటీపడడం చూస్తున్నదే. తాజాగా మౌని రాయ్ షేర్ చేసిన ఫోటోషేట్లలో తన రెడ్ ఫ్రాక్ లుక్ అందరినీ ఆకట్టుకుంటోంది. మౌని చాలా సింపుల్ గా కనిపిస్తున్నా రెడ్ ఫ్రాక్ లో ఎంతో హాట్ నెస్ ఎలివేట్ అవుతోంది. రేబాన్ ధరించి రెబలియన్ యాటిట్యూడ్ తో



ఆకర్షిస్తోంది. మరోవైపు దిశా పటానీ ఈ ట్రిప్ లో అద్భుతమైన డిజైనర్ లుక్స్ తో ఆకర్షించింది. ఆ ఇద్దరూ కలిసి ఉన్న బ్లాక్ లుక్ కూడా ప్రత్యేకంగా ఆకట్టుకుంటోంది. మౌని–దిశా ఎవరికి వారు కెరీర్ పరంగా బిజీ. మౌని రాయ్ చివరిసారిగా వెబ్ సిరీస్ 'సుల్తాన్ ఆఫ్ ఢిల్లీ'లో కనిపించింది. ఇటీవలి ఇంటర్వ్యూలో మౌని సుల్తాన్ ఆఫ్ ఢిల్లీ .. బ్రహ్మాస్త్ర వంటి ప్రాజెక్టులు తనలోని నటి విషయమై ప్రజల అభిప్రాయాన్ని మార్చాయని అంది. 'బ్రహ్మాస్త్ర' పూర్తిగా భిన్నమైనది. గోల్డ్, రా .. మేడ్ ఇన్ చైనా లోను విలక్షణ పాత్రలకు మంచి గుర్తింపు దక్కిందని మౌని తెలిపింది. మరోవైపు దిశా పటానీ తదుపరి ప్రభాస్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం కల్కి లో కనిపించనుంది. దీనికి సంబంధించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

గరుడ వార్త





# కాళేశ్వరంపై విజిలెన్స్ తనిఖీలు

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించిన వ్యవహారంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం తనిఖీలు చేపట్టారు.

ఎర్రమంజిల్ జలసౌధలోని కాళేశ్వరం కార్పొరేషన్ కార్యాలయంలో రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవ్‌పూర్‌లోని సాగునీటి డివిజన్ కార్యాలయాల్లో మేడిగడ్డ, కన్నెపల్లి పంప్‌హౌస్‌కు సంబంధించిన దస్త్రాలను, కరీంనగర్ ఎల్‌ఎండీలోని ఇరిగేషన్ కార్యాలయంలో కాళేశ్వరం, మేడిగడ్డ ప్రాజెక్ట్‌కు సంబంధించిన దస్త్రాలను పరిశీలిస్తున్నారు. ఈ తనిఖీల్లో 10 ఇంజినీరింగ్, విజిలెన్స్ బృందాలు పాల్గొన్నాయి.

# కాంగ్రెస్ పట్ల ప్రజల్లో అసహనం ప్రారంభమైంది



ఖమ్మం: ఖమ్మం వంటి ఒకటి రెండు జిల్లాల్లో తప్పితే ఎన్నికల్లో ప్రజలు బిఆర్ఎస్ పార్టీని పూర్తిగా తిరస్కరించలేదని ఎమ్మెల్యే కేటీఆర్ పేర్కొన్నారు. నేడు ఖమ్మం పార్లమెంట్ నియోజక వర్గస్థాయి సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. 39 ఎమ్మెల్యే సీట్లను గెలవడంతో పాటు 11 స్థానాలు అత్యల్ప మెజారిటీతో చేజారిపోయామన్నారు. ప్రజల్లో ఉన్న అసంతృప్తికి కారణాలు చర్చించుకుని.. సమీక్షించుకుని ముందుకు సాగుతామని తెలిపారు. వాగ్దానం చేసిన దానికి భిన్నంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని కేటీఆర్ అన్నారు. "కాంగ్రెస్ పట్ల ప్రజల్లో అసహనం ప్రారంభమైంది. ప్రజల విశ్వాసాన్ని స్వల్పకాలంలో కోల్పోయే లక్షణం కాంగ్రెస్ పార్టీ సొంతం. 1989 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీని తిరస్కరించి కాంగ్రెస్‌ను గెలిపించారు. కేవలం ఏడాదిన్నర స్వల్పకాలంలోనే కాంగ్రెస్ పార్టీ మీద జనం విశ్వాసాన్ని కోల్పోయారు. నాటి లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాజయం పాలయ్యింది. ఆ ఎన్నికల్లో అదే ప్రజలు టీడీపీని తిరిగి భారీ మెజారిటీతో గెలిపించారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నిలుపుకునే నిజాయితీ చిత్తశుద్ధి కాంగ్రెస్ పార్టీకి ఉండదు. గత నెల రోజుల ఎన్నికల అనంతర పరిణామాలను పరిశీలిస్తే మరోసారి ఇది రుజువైంది. ప్రజలకిచ్చిన వాగ్దానాల అమలు కోసం కాంగ్రెస్ పార్టీ మీద బీఆర్ఎస్ వత్తిడి తెస్తోంది" అని కేటీఆర్ అన్నారు.

# బాలానగర్ ప్లై ఓవర్‌పై ప్రజాపాలన దరఖాస్తులు.. బీఆర్ఎస్ సెటైర్..

హైదరాబాద్: బాలానగర్ ప్లైఓవర్ పై ప్రజాపాలన అభయహస్తం దరఖాస్తులు దర్శనమిచ్చిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. అభయహస్తం దరఖాస్తుల డేటా ఎంట్రీ బాధ్యతను ప్రభుత్వం ఓ ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించింది. ర్యాపిడో వెహికిల్‌పై దరఖాస్తులను తరలిస్తుండగా అవి రోడ్డుపై పడిపోయాయి.

రంగారెడ్డి జిల్లా హయత్ నగర్ మండలానికి చెందిన దరఖాస్తులుగా గుర్తించడం జరిగింది. అయితే ఈ దరఖాస్తులు రోడ్డుపై పడిపోవడంపై బీఆర్ఎస్ పార్టీ ఎక్స్ వేదికగా సెటైర్ వేసింది. బాధ్యతారాహిత్యానికి, అసమర్థతకు కేరాఫ్? అడ్రస్ కాంగ్రెస్ అని పేర్కొంది. ప్రజా పాలన దరఖాస్తులు రోడ్ల పాలు అయ్యాయని.. 5




రూపాయలకు ఎంతో విలువైన రాష్ట్ర ప్రజల వ్యక్తిగత వివరాలను కాంగ్రెస్ పార్టీ తాకట్టు పెట్టిందని బీఆర్ఎస్ ట్వీట్ చేసింది.

# ఆరు గ్యారంటీలు అమలు చేయకుండా డ్రామాలెందుకు ? : బండి సంజయ్



రాజన్న సిరిసిల్ల : అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే 6 గ్యారంటీలను అమలు చేస్తామని హామీనిచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ, కంప్యూటరీకరణ, క్షేత్రస్థాయి పరిశీలన పేరుతో కాలయాపన చేస్తోందని ఎంపీ బండి సంజయ్ కుమార్ విమర్శించారు. షెడ్యూల్ ప్రకారం చూస్తే వచ్చే మార్చి, ఏప్రిల్ లో పార్లమెంట్ ఎన్నికలు జరగబోతున్నాయి. అంతకంటే ముందే ఫిబ్రవరిలోనే ఎన్నికల కోడ్ వచ్చే అవకాశముంది.

ఈ విషయం తెలిసి కూడా దరఖాస్తుల కంప్యూటరీకరణ, క్షేత్రస్థాయి పరిశీలన పేరుతో ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా కాలయాపన చేయడమంటే డ్రామాలాడటమేనని పేర్కొన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గంలోని వెంకటంపల్లి గ్రామానికి వచ్చిన బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. ఆరు గ్యారంటీల పేరుతో కాలయాపన చేస్తూ డ్రామాలు చేస్తే ప్రజలు హర్షించరనే విషయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తుంచుకోవాలని హెచ్చరించారు.

# రోడ్డుపై ప్రజాపాలన దరఖాస్తులు.. సర్కార్ సీరియస్




హైదరాబాద్ : ప్రజాపాలన దరఖాస్తుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై తెలంగాణ ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. బాలనగర్ ప్లై ఓవర్‌పై పడిపోయిన అభయ హస్తం దరఖాస్తుల ట్రాన్స్‌పోర్టు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై బల్దియా చర్యలకు దిగింది. దీనికి సంబంధించి పూర్తి వివరాలు అందించాలని డిప్యూటీ కమిషనర్ జోనల్ కమిషనర్‌ను కమిషనర్ రోనాల్డ్ రోస్ ఆదేశించారు. అనంతరం దరఖాస్తుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరిపై జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ వేటు వేశారు. ఆన్‌లైన్ ఎంట్రీ చేసే క్రమంలో అనవసరంగా బయటివారికి అప్లికేషన్లు ఇచ్చి విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు టీమ్ లీడర్స్‌పై వేటు పడింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్ టీమ్ లీడర్, హయత్‌నగర్ టీమ్ లీడర్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వంపై ఎంతో నమ్మకంతో అప్లికేషన్స్ పెట్టుకుంటే, వాటిని జాగ్రతగా అప్లోడ్ చేయాలన్నారు. ప్రజలకు సంబందించిన అప్లికేషన్స్ విషయంలో ఎవరు నిర్లక్ష్యంగా వ్యవహరించినా చర్యలు తప్పవని రోనాల్డ్ హెచ్చరిచారు. ఏ ఒక్క అప్లికేషన్ వదలకుండా అప్లోడ్ చేయాల్సిందే అని స్పష్టం చేశారు. అరుహులైన వారు అందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని.. ఎవరు సోషల్ మీడియాలో వచ్చే వాటిని నమ్మవద్దని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ వినతి చేశారు.

**ప్లైఓవర్‌పై దఖాస్తులు...** కాగా... బాలానగర్ ప్లైఓవర్‌పై ప్రజాపాలన అభయహస్తం దరఖాస్తులు దర్శనమిచ్చిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. అభయహస్తం దరఖాస్తుల డేటా ఎంట్రీ బాధ్యతను ప్రభుత్వం ఓ ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించింది.

ర్యాపిడో వెహికిల్‌పై దరఖాస్తులను తరలిస్తుండగా అవి రోడ్డుపై పడిపోయాయి. రంగారెడ్డి జిల్లా హయత్ నగర్ మండలానికి చెందిన దరఖాస్తులుగా గుర్తించడం జరిగింది.

# కేసీఆర్‌కు పని తనం తప్ప.. పగతనం తెలియదు

హైదరాబాద్: మాజీ సీఎం కేసీఆర్ కు పని తనం తప్ప పగతనం తెలియదని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంగళవారం నాడు తెలంగాణ భవన్‌లో ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఖమ్మం ఎంపీ స్థానంపై చర్చించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో బీఆర్ఎస్ కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలు పెరిగాయని మండిపడ్డారు. కేసీఆర్ కక్ష సాధింపు చర్యలకు పూనుకుని ఉంటే కాంగ్రెస్ నేతలు జైళ్లలో ఉండే వారని చెప్పారు. కాంగ్రెస్ అన్నిటికీ వంద రోజుల డెడ్ లైన్ పెడుతోందని ఎద్దేవా చేశారు. వంద రోజుల తర్వాత ప్రజలే కాంగ్రెస్‌పై చీటింగ్ కేసులు



పెడతారన్నారు. ఖమ్మం కాంగ్రెస్‌లో మూడు గ్రూపులు ఉన్నాయని చెప్పారు. ఒకటి వైఎ స్సార్ కాంగ్రెస్, ఒకటీ టీడీపీ కాంగ్రెస్, ఇంకోటి ఒరిజినల్ కాంగ్రెస్ అని హరీశ్‌రావు సెటైర్లు వేశారు.



# అర్జున అవార్డు అందుకున్న ఇషా సింగ్, షమీ

ఆసియా క్రీడల్లో పసిడి పతకంతో మెరిసిన తెలంగాణ షూటర్ ఇషా సింగ్, భారత సీనియర్ పేసర్ మహ్మద్ షమీ ప్రతిష్ఠాత్మక అర్జున అవార్డు అందుకున్నారు.

మంగళవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా వీళ్లిద్దరూ ఈ అవార్డు స్వీకరించారు. భారత క్రీడా రంగంలో ఖేల్ రత్న అవార్డు తర్వాత రెండో అత్యుత్తన్నత అవార్డు అందుకున్న షమీ తన కల నిజమైందని అన్నాడు. 'నా కల నిజమైంది. జీవితంలో చాలామందికి ఈ అవార్డు గెలవడం సాధ్యం కాదు.

ఈ అవార్డుకు నన్ను నామినేట్ చేసినందుకు చాలా సంతోషంగా ఉంది' అని షమీ తెలిపాడు. 2023కు గానూ 26 మంది అర్జున అవార్డు స్వీకరించారు. వీళ్లలో ఆసియా గేమ్స్‌లో పతకాలు కొల్లగొట్టిన అథ్లెట్స్ ఎక్కువ మంది ఉండడం గమనార్హం.

**అర్జున అవార్డు అందుకున్నది వీళ్లే :** ఆర్చరీ – అదితి గోపిచంద్ స్వామి, ఒజాస్ ప్రవీణ్ డియోటలే. అథ్లెటిక్స్ – పరుల్ చౌదరి, శ్రీశంకర్ మురళి. బాక్సింగ్ – మహ్మద్ హుసాముద్దీన్. చెస్ – ఆర్ వైశాలి. క్రికెట్ – మహ్మద్ షమీ. ఈక్వెస్ట్రియన్ – అనుష్ అగర్వాల. ఈక్వెస్ట్రియన్ డ్రెస్సేజ్ – దివ్యక్రితి సింగ్. గోల్ఫ్ – దిక్షా దగర్. హాకీ – కృష్ణన్ బహాదర్ పాఠక్, పుఖ్రంబం సుహిలా చాను. కబడ్డీ – పవన్ కుమార్, రీతు నేగీ. ఖో ఖో – నస్రీన్.లాన్ బౌల్స్ – పింకీ షూటింగ్ – ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్. ఈషా సింగ్. స్క్వాష్ – హరీందర్ పాల్ సింగ్ సాధు. టేబుల్ టెన్నిస్ – ఆహికా పంగల్. రెజ్లింగ్ – సునీల్ కుమార్, అంతిమ్ పంగల్. వుషూ – నవోరెమ్ రోషిబిన దేవి. పారా ఆర్చరీ – శీతల్ దేవి. అంధుల క్రికెట్ – ఇల్లూరి అజయ్ కుమార్ రెడ్డి. పారా కనోయింగ్ – ప్రచీ యాదవ్. సొంత గడ్డపై జరిగిన వన్డే వరల్డ్ కప్‌లో అద్భుతంగా రాణించినందుకు షమీ పేరును బీసీసీఐ సిఫారసు చేసింది. మోగా టోర్నీలోకి ఆలస్యంగా ఎంట్రీ ఇచ్చిన షమీ 7 మ్యాచుల్లో 24 వికెట్లు పడగొట్టాడు. తన సూపర్ బౌలింగ్‌తో టీమిండియాను ఫైనల్‌కు చేర్చాడు. అయితే.. టైటిల్ పోరులో షమీ రెండు వికెట్లతో విజృంభించినా ట్రావిస్ హెడ్(137) సూపర్ సెంచరీతో ఆస్ట్రేలియాను గెలిపించాడు.



# చంద్రుడిపైకి అమెరికా ల్యాండర్.. ప్రయోగం విఫలం!

వాషింగ్టన్: అమెరికా నుంచి దాదాపు 50 ఏళ్ల తర్వాత చందమామపైకి ఒక ల్యాండర్ పంపాలని చేసిన ప్రయోగం దాదాపు విఫలమైంది! పెరిగ్రిన్ వ్యోమనౌకను చంద్రుడిపై దింపాలని నిర్దేశించుకున్న లక్ష్యాన్ని విరమించుకుంటున్నట్లు దాన్ని అభివృద్ధి చేసిన ప్రైవేటు కంపెనీ ఆస్ట్రోబోటిక్ టెక్నాలజీ ప్రకటించింది. ఈ మిషన్ లక్ష్యాలను ప్రస్తుతం పునఃసమీక్షించే పనిలో ఉన్నట్లు వెల్లడించింది. ఇంధన లీక్ కారణంగా వ్యోమనౌక కీలక ప్రొపెల్లెంట్‌ను కోల్పోయిందని ఆ సంస్థ తెలిపింది. సోమవారం వుల్కన్ రాకెట్ ద్వారా ఫ్లోరిడాలోని కేప్ కెనావెరాల్ స్పేస్ ఫోర్స్ స్టేషన్ నుంచి పెరిగ్రిన్‌ను నింగిలోకి ప్రయోగించిన విషయం తెలిసిందే. ఏడు గంటల తర్వాత ఈ వ్యోమనౌకలో ఇబ్బంది తలెత్తింది. ల్యాండర్‌కు సంబంధించిన సౌరఫలకం.. సూర్యుడికి అభిముఖంగా లేదని ఇంజినీర్లు గుర్తించారు. ప్రొపెల్లెంట్ కోల్పోవడం వల్లే ఈ సమస్య తలెత్తినట్లు వెల్లడించారు. దీనివల్ల పెరిగ్రిన్ బ్యాటరీల ఛార్జింగ్ కోసం కావాల్సిన విద్యుదుత్పత్తి జరగడం లేదని చెప్పారు. బ్యాటరీల సమస్యను ఎట్టకేలకు శాస్త్రవేత్తలు పరిష్కరించారు. కానీ, ప్రొపెల్లెంట్ కోల్పోవడం వల్ల తలెత్తిన అసలు సమస్యను మాత్రం సరి చేయలేకపోయామని వెల్లడించారు. పెరిగ్రిన్ దిశను సమయానుకూలంగా మార్చే 'యాటిట్యూడ్ కంట్రోల్ సిస్టమ్'లోని థ్రస్టర్లు ఇంధన లీక్ కారణంగా నిర్దేశిత క్రమంలో పనిచేయడం లేదని ఆస్ట్రోబోటిక్ ప్రకటించింది. అవి గరిష్ఠంగా మరో 40 గంటలు మాత్రమే పనిచేసే అవకాశం ఉందని స్పష్టం చేసింది. ఆ తర్వాత సూర్యుడికి అభిముఖంగా వ్యోమనౌక దిశను మార్చడం కుదరదని.. ఫలితంగా విద్యుదుత్పత్తి నిలిచిపోతుందని వివరించింది. ఆలోపే పెరిగ్రిన్‌ను చంద్రుడికి వీలైనంత దగ్గరగా తీసుకెళ్లడమే తమ ప్రస్తుత లక్ష్యమని వెల్లడించింది. అంటే చంద్రుడిపైకి చేరుకోవాలన్న లక్ష్యం దాదాపు విఫలమైనట్లే! పెరిగ్రిన్ ల్యాండర్ కోసం 108 మిలియన్ డాలర్లకు ఆస్ట్రోబోటిక్‌తో.. అమెరికా అంతరిక్ష సంస్థ–నాసా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ వ్యోమనౌక ఎత్తు ఆరు అడుగులు. ఇందులో.. జాబిల్లిపై నీటి తీరుతెన్నులను శోధించే 'పెరిగ్రిన్ అయాన్ మాస్ స్పెక్ట్రోమీటర్' సహా పలు సైన్స్ పరికరాలు ఉన్నాయి. ఇంకా అనేక వస్తువులను భూమి నుంచి మోసుకెళ్లింది. వాటిలో.. ఎవరెస్టు పర్వతం నుంచి సేకరించిన రాతి తునక, చిన్న రోవర్లు, మెక్సికోకు చెందిన చక్రాల రోబోలు, వికీపీడియా ప్రతి, ఒక బిట్‌కాయిన్, కొన్ని ఫొటోలు, డ్రాయింగ్స్, ఆడియో రికార్డింగ్‌లు ఉన్నాయి. అమెరికా మాజీ అధ్యక్షులు జాన్ ఎఫ్ కెనెడీ, జార్జ్ వాషింగ్టన్, ఐజన్‌హోవర్, 'స్టార్ ట్రెక్' టీవీ ధారావాహిక సృష్టికర్త జీన్ రాడన్‌బెర్రీ, ప్రముఖ సైన్స్ కాల్పనిక సాహిత్య రచయిత ఆర్థర్ సి క్లార్క్‌కు సంబంధించిన అవశేషాలు, డీఎన్ఏనూ ఈ వ్యోమనౌక వెంట తీసుకెళ్లింది.

# ఐఏఎస్ అరవింద్ కుమార్‌కు మెమో జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం



హైదరాబాద్: ఫార్ములా–ఈ కార్ రేసింగ్‌కు సంబంధించిన వ్యహారంలో ఐఏఎస్ అరవింద్ కుమార్‌కు తెలంగాణ ప్రభుత్వం మంళవారం మెమో జారీ చేసింది. ఫార్ములా ఈ రేసుకు సంబంధించిన ఒప్పందంలోని కొన్ని అంశాలపై పూర్తి వివరణ ఇవ్వాలని అరవింద్ కుమార్‌కు ప్రభుత్వం మెమో ఇచ్చింది. ఫార్ములా–ఈతో త్రైపాక్షిక లాంగ్ ఫారమ్ ఒప్పందం ఎందుకు నమోదు చేశారో తెలపాలని అరవింద్ కుమార్‌ను వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ప్రభుత్వ అనుమతి లేకుండా రూ. 54 కోట్లను హెచ్ఎండీఏ నుంచి ఫార్ములా ఈ రేసుకు బదిలీ చేశారని ఆరోపణలు అరవింద్ కుమార్‌పై ఉన్న విషయం తెలిసిందే. హైదరాబాద్‌లో ఫార్ములా–ఈ కార్ రేసింగ్ పోటీలను (రేస్ రౌండ్–4) రద్దు చేసినట్లు ఇటీవల ఫార్ములా–ఈ ఆపరేషన్స్ (ఎఫ్ ఈఓ) ప్రకటించింది. ఫిబ్రవరి 10వ తేదీన నెక్లెస్‌రోడ్డు స్ట్రీట్ సర్క్యూట్‌లో నిర్వహించవల్సిన ఈ అంతర్జాతీయ పోటీలపై తెలంగాణ ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.

ఫార్ములా–ఈ పోటీలపై గతేడాది అక్టోబర్ 30వ తేదీన ఏర్పాటు చేసుకున్న ఒప్పందాన్ని ప్రభుత్వం ఉల్లంఘించిందని ఆరోపించిన విషయం తెలిసిందే.

# విడతల వారీగా రైతుబంధు నిధులు..

హైదరాబాద్, జనవరి 9: మేడిగడ్డపై సంబంధిత మంత్రి స్పందిస్తారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ... ప్రజా భవన్‌లో ఎవరైనా రోజు ఉదయం 8:30 నుంచి 9:30 వరకు కలవొచ్చని అన్నారు. పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ ఏమీ చేయలేదని విమర్శించారు. ప్రతి నియోజకవర్గంలో లక్ష ఎకరాల ఆయకట్టు ఇస్తామని అన్నారు ఇచ్చారా? అని ప్రశ్నించారు. డబుల్ బెడ్ రూమ్‌లు అన్నారు హామీ గత ప్రభుత్వం ఏమి చేసిందని నిలదీశారు. తాము సంపదని సృష్టిస్తామన్నారు. రైతుబంధుకి రోజు వారీగా నిధులు విడుదల చేస్తామన్నారు. ఒక ఎకరం వరకు రైతు బంధు అకౌంట్స్‌లో జమ అయ్యిందని.. 2 ఎకరాల వారికి రైతు బంధు పడుతోందని తెలిపారు. విడుతల వారీగా నిధులు విడుదల చేసి రైతు బంధు ఇస్తామని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ వాళు



ృ హామీలు చేయకపోతే బాగుండు అని బీఆర్ఎస్ నేతలు కోరుకుంటున్నారని భట్టి విక్రమార్క వ్యాఖ్యలు చేశారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com